Email : telanganaveenaoffcial@gmail.com

Title Code : 12280

# తెలంగాణ వీణ

నిజం నిగ్గు తేలుద్దాం..

epaper.telanganaveena.com | సంపుటి :2 | సంచిక: 49 | హైదరాబాద్ | 10 ఆదివారం నవంబర్ 2024 | పేజీలు: 8 | రూ.3/-




## మీరు దేశంలో కుల గణన చేపడతారా లేదా

కుల గణనపై మీ వైఖరేంటి

ఎంపి లక్ష్మణ్‌కు మంత్రి పొన్నం సవాల్



02

## వాన్ని లోపలేద్దాం వీన్ని లోపలేద్దాం అంటే కుదరదు

ఈ పదకొండు నెలల కాంగ్రెస్ పాలనలో ఏం కోల్పోయారో తెలంగాణ ప్రజలకు తెలిసొచ్చిందని భారాస అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అన్నారు. మళ్లీ భారాస అధికారంలోకి వస్తుందని, రావాలని కూడా ప్రజలు చెబుతున్నారని తెలిపారు. పాలకుర్తి నియోజకవర్గ భారాస నేతలతో కేసీఆర్ ఫామ్‌హౌజ్‌లో సమావేశమయ్యారు.

- పాలన అంటే ఆషామాషీ కాదు
- మళ్లీ వందశాతం అధికారంలోకి రావడం ఖాయం
- 11 నెలల కాంగ్రెస్ పాలనతో ఏం కోల్పోయామో ప్రజలు గుర్తించారు
- పాలకుర్తి నియోజకవర్గ నేతలతో సీఎం కెసిఆర్ మాటామంతీ

02



## రైతులంటే ఎందుకంతా చులకన..?

- ▶ధాన్యం కేంద్రాల్లోనే మొలకలొస్తుంటే సీఎంకు సిగ్గులేదా..?
- ▶రైతులపై రేవంత్‌ది బస్మాసుర హస్తం
- ▶వడ్ల కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**భువనగిరి, నవంబర్ 9 (తెలంగాణ వీణ) :**

25 రోజులుగా వరి కొనుగోలు కేంద్రాల వద్దనే ఉండటంతో అక్కడే వాటికి మొలకలొస్తున్నాయని, వాటిని చూసైనా సీఎం రేవంత్‌కు సిగ్గు అనిపించడం లేదని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. ౧తులపై కాంగ్రెస్ బస్మాసుర హస్తంగా మారిందన్నారు. యాదాద్రి జిల్లా పోచంపల్లి మండల కేంద్రంతోపాటు రేవన్నపల్లిలో వడ్ల కొనుగోలు కేంద్రాలను కిషన్ రెడ్డి పరిశీలించారు.

02



## మంత్రి శ్రీధర్ బాబు ఇంట్లో చోరీ

అపహరణకు గురైన సెల్‌ఫోన్

**హైదరాబాద్,నవంబర్9(తెలంగాణ వీణ):**

మంత్రి శ్రీధర్ బాబు ఇంట్లో దొంగలు బీభత్సం సృష్టించారు. బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 12లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో మంత్రిశ్రీధర్ బాబు ఉంటున్నారు. దీపావళి రోజున సెల్‌ఫోన్ చోరీకి గురైనట్లు గుర్తించారు. కాగా ఈ సంఘటనపై వెంటనే శ్రీధర్ బాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు. చోరీకి గురైన సెల్‌ఫోన్ వెతికి పెట్టాలని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. మంత్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఇంటి దగ్గరలో ఉండే సీసీ కెమెరాలను పోలీసులు నిశితంగా పరిశీలిస్తున్నారు. అనుమానితులు ఎవరైనా కనిపిస్తే పోలీసులు విచారణ చేస్తున్నారు. ఈ చోరీ విషయం బయటకు రావడంతో స్థానికులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. మంత్రికే రక్షణ లేకపోతే తమ పరిస్థితి ఏంటని పోలీసులను ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అయితే నెల రోజుల క్రితం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఇంట్లో చోరీ జరిగిన విషయం తెలిసిందే. తాజాగా మంత్రి శ్రీధర్ బాబు ఇంట్లో చోరీ జరగడంతో చర్చనీయాంశంగా మారింది.డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఇంట్లో చోరీ కలకలం రేపింది. ఇంటి వాచ్‌మన్ తన స్నేహితుడితో కలసి దొంగతనానికి పాల్పడి పారిపోగా.. పశ్చిమ బెంగాల్‌లో వారిని పట్టుకున్నారు.

## ప్రాజెక్టుల్లో భారీగా అవినీతి

మేఘా, రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌కు కేకు ముక్కల్లా ప్రాజెక్టులు

మాజీ మంత్రి కేటీఆర్ తీవ్ర ఆరోపణలు



02

## రేవంత్ తాటాకు చప్పళ్లకు ఎవరూ బెదరరు

కేటీఆర్ అరెస్టు చేయిస్తా అని లీకులు ఇస్తుండు

ప్రశ్నించే గొంతుపై దాడి చేయాలని కుట్రలు

నర్సాపూర్ విలేకరుల సమావేశంలో హరీశ్‌రావు



02

## పితృస్వామ్యం ఉందని నిందించొద్దు



## అలా అయితే ఇందిర ప్రధాని ఎలా అయ్యారు

## కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్



**బెంగళూరు,నవంబర్9(తెలంగాణ వీణ):**

పితృస్వామ్యం ఉందని నిందించొద్దని, అలా అయితే ఇందిర ప్రధాని ఎలా అయ్యారని మహిళా సాధికారత, పితృస్వామ్యంపై కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ కీలక వ్యాఖ్యలు చేశారు. పితృస్వామ్యం మహిళ ఎదుగుదలను అడ్డుకుంటే ఇందిరా గాంధీ ఏ విధంగా ప్రధానమంత్రి అయ్యారని ప్రశ్నించారు. బెంగళూరులో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. దేశంలో సమానత్వం ఉందని స్త్రీ, పురుష వివక్షత లేదన్నారు. మహిళా సాధికారతపై అడిగిన ప్రశ్నపై కేంద్రమంత్రి స్పందిస్తూ.. 'భారత్‌లో మహిళల ఎదుగుదలను పితృస్వామ్యం అడ్డుకుంటే.. మరి ఇందిరాగాంధీ ప్రధాని ఎలా అయ్యారు..? ఇలాంటివి విని మోసపోకండి. మీ కోసం మీరు నిలబడి, తర్కయుక్తంగా మాట్లాడితే. ఏ పితృస్వామ్యం మిమ్మల్ని, మీ ఎదుగుదలను అడ్డుకోలేదు' అని సీతారామన్ పేర్కొన్నారు. అయితే.. మహిళలకు తగిన సౌకర్యాలు కల్పించడం లేదని, దీని కోసం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. భారత్‌లో ఆవిష్కర్తలకు ఉన్న అవకాశాలపై అడిగిన ప్రశ్నకు ఆమె బదులిచ్చారు. 'ప్రధాని మోదీ ఆవిష్కర్తలకు అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించారు. కొత్త ఆవిష్కరణల కోసం కేంద్రం కృషి చేస్తోంది. అది మాత్రమే కాకుండా ఆవిష్కరణలకు తగిన మార్కెట్లను కనుగొనేందుకు కృషి చేస్తోంది' అని తెలిపారు. మొత్తం ప్రభుత్వ కొనుగోళ్లలో 40 శాతం ఎమ్ఎస్ఎమ్ఈల నుంచే వస్తున్నాయని వెల్లడించారు. దీనివల్లే 2 లక్షల స్టార్టప్‌లు పుట్టుకొచ్చాయని.. అందులో 130 యూనికార్న్‌లుగా అవతరించాయని అన్నారు.



02

## 370 పునరుద్ధరణపై కాంగ్రెస్‌కు ఎందుకు ప్రేమ

- దేశమంతా ఒక్కటిగా ఉండడం ఇష్టం లేని కాంగ్రెస్
- ఏటీఎంలుగా మారిన కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలు
- మహారాష్ట్ర ప్రచారంలో ప్రధాని మోదీ విమర్శలు

## ప్రధాని మోదీ అబద్దాల ప్రచారం ఆపాలి

అప్పటి వరకు నిజాలు చెబుతూనే ఉంటాం

మహారాష్ట్ర ప్రచారంలో సీఎం రేవంత్



02

మొదటి పేజీ తరువాయి

## రేవంత్ తాటాకు చప్పుళ్లకు
# ఎవరూ బెదరరు

**మెదక్, నవంబర్ 9 (తెలంగాణ వీణ):**

రేవంత్ తాటాకు చప్పుళ్లకు ఇక్కడ ఎవరూ భయపడేవారు లేరని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. కావాలనే కొందరితో కేటీఆర్‌ను అరెస్టు చేయిస్తున్నానని లీకేజీలు పంపుతున్నారని ఆయన ఆరోపించారు. మీ అన్యాయాలను ప్రశ్నిస్తూ.. మోసాలను ఎండగడుతున్న కేటీఆర్ మీద కుట్ర చేస్తున్నావ్ అంటే.. అది రాష్ట్ర ప్రజల మీద దాడి చేయడమే అని రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మెదక్ జిల్లా నర్సాపూర్‌లో మీడియాతో హరీశ్‌రావు మాట్లాడారు. కేటీఆర్‌ను అరెస్టు చేయిస్తా అని లీకులు రాయిస్తున్నారు. కేటీఆర్ ఏం చేసిండు.. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచిండు.. రాష్ట్ర గౌరవం, ప్రతిష్టను పెంచిండు... ముంబై, ఢిల్లీ, బెంగళూరును కాదని హైదరాబాద్‌కు పెట్టుబడులు తెచ్చిండు. ఐటీలో తెలంగాణను నంబర్ వన్‌గా చేసిండు. నువ్వేమో డైవర్షన్ కోసం కేసులు పెడుతా..? అరెస్టులు చేయిస్తా..? అని లీకులు ఇస్తున్నవ్. నీ లీకులకు, తాటాకు చప్పుళ్లకు ఎవడు భయపడడు. ఇవాళ కేటీఆర్ మీద కుట్ర చేస్తున్నావ్ అంటే అది ప్రశ్నించే గొంతు మీద కుట్ర. ప్రశ్నించే గొంతు మీద దాడి. కేటీఆర్ నీ ప్రభుత్వాన్ని బట్టలు విప్పిండు. మీ అన్యాయాలను ప్రశ్నించిండు. మీ మోసాలను ఎండగట్టిండు. అందుకే నీవు కేటీఆర్ మీద పగ పట్టినవ్.. కక్ష పెంచుకున్నవ్. కానీ ఈ దాడి ఒక్క కేటీఆర్ మీద కాదు.. ఇది రాష్ట్ర ప్రజల మీద, బీఆర్ఎస్ పార్టీ మీద దాడి, ప్రశ్నించే గొంతు మీద దాడిగా మేం చూస్తున్నామని హరీశ్‌రావు పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి చిల్లర మాటలు మాట్లాడుతున్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కేసీఆర్‌పై చేసిన వ్యాఖ్యలు అప్రజా స్వామికం. రాష్ట్రంలో పాలనను గాలికి వదిలేసి సీఎం, మంత్రులు గాలిమోటార్లలో చక్కర్లు కొడుతున్నారు. మూసీ దురావస్థకు కారణం కాంగ్రెస్, టీడీపీల పాలననే. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసింది. ప్రజాబలంతోనే కాంగ్రెస్ కుట్రలను ఎదుర్కొంటాం అని హరీశ్‌రావు తేల్చిచెప్పారు.

మొదటి పేజీ తరువాయి

# ప్రాజెక్టుల్లో భారీగా అవినీతి

**హైదరాబాద్, నవంబర్ 9 (తెలంగాణ వీణ):**

నారాయణపేట..కొడంగల్ లిఫ్ట్ పనులు మేఘా, రాఘవ కన్‌స్ట్రక్షన్‌కు అప్పగించడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ లిఫ్ట్ ద్వారా రేవంత్ రెడ్డి భారీ అవినీతికి పాల్పడుతున్నారని కేటీఆర్ ఆరోపించారు. ఈ ప్రాజెక్టు పనులు మేఘా, రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌కు కేకు ముక్కల్లా పంచారు. ఎల్ అండ్ టీ, ఎన్‌సీసీ(నాగార్జున కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ) లాంటి కంపెనీలను కాదని ఎక్కువ కోట్ చేసిన మేఘా, రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌కు ఎలా కట్టబెడుతారు..? అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కేటీఆర్ ప్రశ్నించారు. సుంకిశాల ప్రమాదానికి కారణమైన మేఘాను బ్లాక్ లిస్టులో పెట్టాల్సింది పోయి మేఘాకే ఈ ప్రాజెక్టును గిఫ్ట్‌గా ఇచ్చారు. కాంగ్రెస్ ఖజానా నింపుకునేందుకు తెలంగాణను ఏటీఎంగా వాడుతున్నారు. తెలంగాణ రాష్ట్రం ఇబ్బందుల్లో ఉంటే రూ. 4,350 కోట్ల ప్రజాధనాన్ని కొందరికి అప్పగించారు. ఈ అవినీతి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని కేటీఆర్ తేల్చిచెప్పారు. అయితే మొదట టెక్నికల్ బిడ్స్ తెరిచి నిర్మాణ సంస్థల అర్హతలు, సాంకేతిక అంశాలను అధికారులు పరిశీలించారు. ఎల్ అండ్ టీ, నాగార్జున కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ అనర్హతకు గురైనట్లు అధికారులు తెలిపారు. ప్రైస్ బిడ్స్ తెరవగా మిగిలిన రెండు సంస్థలు ఒక్కో ప్యాకేజీ దక్కించుకున్నాయి. మొదటి ప్యాకేజీ కింద రూ. 1,134.62 కోట్ల పనులకు పిలిచిన టెండర్‌కు 3.9 శాతం అధికంగా కోట్ చేసిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్ ఎల్-1గా నిలిచింది. 4.85 శాతం అధికంగా కోట్ చేసిన మేఘా ఎల్-2గా నిలిచింది. రెండో ప్యాకేజీ కింద రూ. 1,126.85 కోట్ల పనులకు పిలిచిన టెండర్‌కు 3.95 శాతం అధికంగా కోట్ చేసిన మేఘా ఎల్-1గా, 4.80 శాతం అధికంగా కోట్ చేసిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్ ఎల్-2గా నిలిచాయి.

## 370 పునరుద్ధరణపై కాంగ్రెస్‌కు
# ఎందుకు ప్రేమ

**ముంబై,నవంబర్9(తెలంగాణ వీణ):**

ఆర్టికల్ 370ని రద్దు చేసినా తిరిగి పునరుద్ధరించాలని కాంగ్రెస్ పట్టుబడు తోందని..అదంటే వారికి ఎందుకు అంత ప్రేమ అని ప్రధాని నరేంద్ర మోదీ ప్రశ్నించారు. దేశమంతా ఒక్కటిగా ఉండడం వారికి ఇష్టం లేదన్నారు. అలాగే కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలను ఎటిఎంలుగా మార్చు కుందని దుయ్యబట్టారు. మహారాష్ట్ర ఎన్నికలుసమీపిస్తుండడంతో ప్రధాని నరేంద్ర మోదీ విస్తృతంగా ప్రచారాల్లో పాల్గొంటున్నారు. ఇందులో భాగంగా నాందేడ్‌లో జరిగిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ప్రధాని కాంగ్రెస్ పై విమర్శలు గుప్పించారు. మహారాష్ట్ర ప్రజలు భాజపా, మహాయుతికూటమికి మద్దతుగా ఓట్లు వేయాలని కోరారు. మహాయుతి ప్రభుత్వం మాత్రమే రాష్ట్రంలో వేగవంతమైన పురోగతిని తీసుకొస్తుం దన్నారు. ప్రతిపక్షం మహా వికాస్ అఘాడీ(ఓ÷ఎం) అంటే అవినీతి, వేల కోట్ల రూపాయల కుంభకోణాలకు కేంద్రమని ఆ కూటమి అధికారంలోకి వస్తే రాష్ట్ర భవిష్యత్తు కుంటుపడుతుందని హెచ్చరించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఎన్నికల ర్యాలీల్లో ప్రదర్శించే రాజ్యాంగం అసలైనది కాదని..నకిలీదని మోదీ పేర్కొన్నారు. ఎరుపు రంగు అట్టవేసి ఉన్న ఖాళీ పేజీల పుస్తకాన్ని చూపిస్తూ..రాజ్యాంగం అని ప్రచారం చేస్తూ రాజ్యాంగాన్ని అవమానిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. డా.అంబేద్కర్‌పై కాంగ్రెస్‌కు ఉన్న నిర్లక్ష్యానికి, ద్వేషానికి ఇది నిదర్శనమని మోదీ అన్నారు. అభివృద్ధి చెందిన దేశాల వరుసలో భారత్‌ను నిలబెట్టడానికి భాజపా, దాని మిత్రపక్షాలు కృషి చేస్తున్నాయని..ఇది దేశ ప్రజలకు తెలుసని అందుకే అన్ని రాష్ట్రాల ప్రజలు భాజపా, ఎన్డీఏ ప్రభుత్వాలకు మద్దతిస్తున్నారని తెలిపారు. హరియాణా ఎన్నికల్లో జరిగిందే మహారాష్ట్రలోనూ పునరావృతం అవుతుందని మోదీ పేర్కొన్నారు. తాము అధికారం లోకి వస్తే మహిళా సాధికారతే లక్ష్యంగా మరిన్ని పథకాలు తీసుకువస్తామని హామీ ఇచ్చారు. 288 శాసనసభ స్థానాలు కలిగిన మహారాష్ట్రలో నవంబరు 20న ఒకేవిడతలో పోలింగ్ జరగనుంది. నవంబరు 23న ఫలితాలను ప్రకటించనున్నారు. ఏ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినా ఆ రాష్ట్రం పార్టీ 'షాహీ పరివార్'కు ఎటిఎంగా మారుతుంటుందని ప్రధాని నరేంద్ర మోదీ శనివారం ఆరోపించారు. ఈ నెల 20 నాటి మహారాష్ట్ర శాసనసభ ఎన్నికలకు సంబంధించి అకోలాలో ఒక ప్రచారం ర్యాలీలో ప్రధాని మోడీ ప్రసంగిస్తూ, రాష్ట్రాన్ని కాంగ్రెస్ ఎటిఎం కానివ్వబోమని స్పష్టం చేశారు. ఎన్నికల్లో గెలుపు కోసం కాంగ్రెస్ అంత ఎక్కువగా అవినీతికి పాల్పడుతున్నప్పుడు అధికారంలో ఉంటే ఆ పార్టీ ఎంత అవినీతిమయంగా ఉంటుందో ఎవరైనా ఊహించుకోవచ్చునని ప్రధాని అన్నారు. 'కాంగ్రెస్ ఎక్కడ ప్రభుత్వం ఏర్పాటు చేసినా ఆ రాష్ట్రం పార్టీ షాహి పరివార్‌కు ఎటిఎంగా మారిపోతుంది. మహారాష్ట్ర ఎన్నికల కోసం కర్నాటకలోని మద్యం వ్యాపారుల నుంచి రూ. 700 కోట్లు బలవంతంగా వసూలు చేశారు. తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్ కూడా ఆ షాహీ పరివార్ ఎటిఎంలుగా మారాయని మోడీ ఆరోపించారు. మహాయుతి మహిళల భద్రత, ఉద్యోగావకాశాలు, లడ్కీ బహిన్ యోజన విస్తరణపై దృష్టి కేంద్రీకరిస్తుండగా, కాంగ్రెస్, శివసేన (యుబిటి), శరద్ పవార్‌కు చెందిన ఎన్‌సిపి (ఎస్‌పి)తో కూడిన మహా వికాస్ అఘాడి (ఎంవిఎ) 'అవినీతి పత్రం'తో వచ్చిందని ఆయన పేర్కొన్నారు. 'ఎంవిఎ అంటే అవినీతి, టోకెన్ డబ్బు, బదలీ నియామక వ్యాపారం అనేదని మొత్తం దేశానికి తెలుసు' అని ఆయన విమర్శించారు. కాంగ్రెస్‌ను ప్రధాని మరింతగా తూర్పారపడుతూ, పార్టీ షాహీ పరివార్ ఎన్నడైనా బాబాసాహెబ్ అంబేద్కర్ 'పంచ్‌తీర్థ్'ను సందర్శించారా అని తాను సవాల్ చేస్తున్నానని చెప్పారు. మధ్య ప్రదేశ్‌లోని మ్హౌలోని అంబేద్కర్ జన్మస్థలం, యుకెలో ఆయన చదువుకున్నప్పుడు లండన్‌లో ఆయన బస చేసిన ప్రదేశం, నాగ్‌పూర్‌లో ఆయన బౌద్ధమతం స్వీకరించిన దీక్ష భూమి, ఢిల్లీలోని ఆయన 'మహాపరినిర్వాణ్ స్థల్', ముంబయిలోని 'చైత్య భూమి'ని ఉద్దేశించి మోడీ 'పంచ్‌తీర్థ్' పదం ప్రస్తావించారు. 'బాబాసాహెబ్ దళితుడు కనుక, రాజ్యాంగం రూపకల్పన ఘనత ఆయనకు దక్కినందున ఆయనను వారు ద్వేషిస్తారు. బాబాసాహెబ్ నాకు, బిజెపి, నా ప్రభుత్వానికి ఒక స్ఫూర్తిదాత. ఆయన వారసత్వ సంపదకు సంబంధించిన ప్రదేశాలను మా ప్రభుత్వం అభివృద్ధి చేసింది. మా యుపిఐకి భీమ్ యుపిఐ అని నామకరణం చేశాను' అని మోడీ తెలియజేశారు. కులాలు, మతాలను పరస్పరం వైరి వర్గాలుగా మార్చడం, దళితులు, వెనుకబడిన వర్గాలు సమైక్యం కాకుండా నిరోధించడం కాంగ్రెస్ గేమ్ ఎ÷-లాన్ అని, అయితే, 'ఏక్ హై తో సేఫ్ హై' అనే మంత్రాన్ని అనుసరించి హర్యానా ప్రజలు ఆ కుట్రను భగ్నం చేశారని మోడీ అన్నారు. దేశం దుర్బలంగా ఉంటేనే తాను పటిష్ఠం కాగలనని కాంగ్రెస్‌కు తెలుసు అని ఆయన పేర్కొన్నారు. గడచిన రెండు విడతలలో తన ప్రభుత్వం నాలుగు కోట్ల మందిపేద ప్రజలకు ఇళ్లు సమకూర్చగలిగిందని, మరి మూడు కోట్ల ఇళ్లు నిర్మించనున్నదని మోడీ తెలిపారు, తన మూడవ విడతలో మహారాష్ట్రలోని వాధవాన్ రేవుతో సహా అనేక లక్షల కోట్ల రూపాయల ప్రాజెక్టుల నిర్మాణం జరుగుతోందని, అది పూర్తి అయితే దేశంలోనే అతి పెద్దది అవుతుందని ప్రధాని మోడీ చెప్పారు.

మొదటి పేజీ తరువాయి

# ప్రధాని మోడీ అబద్ధాల ప్రచారం ఆపాలి

**ముంబై,నవంబర్9(తెలంగాణ వీణ):**

మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో ప్రధాని నరేంద్ర మోదీ.. తెలంగాణ ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై ప్రధాని అబద్దాలు చెబుతున్నారని విమర్శించారు. ఆయన అబద్దాలు మానసంత వరకు నిజాలు చెబుతూనే ఉంటామని అన్నారు. తెలంగాణలో ఇచ్చిన అన్ని హామీలు నేరవేరుస్తున్నామని.. రాష్ట్ర ప్రభుత్వంపై ప్రధాని మోడీ పచ్చి అబద్దాలు మాట్లాడుతున్నారని సీఎం రేవంత్ రెడ్డి ఫైర్ అయ్యారు. విభజన రాజకీయాలతో ప్రజల మధ్య బీజేపీ చిచ్చు పెడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం సీఎం రేవంత్ రెడ్డి మహారాష్ట్రలో పర్యటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల సీఎంల మీటింగ్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో తెలంగాణ ప్రభుత్వంపై ప్రధాని మోడీ అబద్దాలు మాట్లాడుతున్నారని విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వం అమలు కానీ హామీలు ఇచ్చిందని తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. తెలంగాణలో ఇచ్చిన హామీలన్నీ నేరవేరుస్తామని స్పష్టం చేశారు. రైతులకు హామీ ఇచ్చిన మేరకు 22 లక్షల మంది రైతులకు రూ.17 వేల కోట్ల రుణాలు మాఫీ చేశామని తెలిపారు. రైతులపై ప్రధాని మోడీ వేసిన ప్రశ్నలకు నేను సమాధానం చెప్పాక ఆయన పోస్ట్ డిలీట్ చేశారని అన్నారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన 10 నెలల్లోనే 50 వేల ఉద్యోగాలు ఇచ్చామని గుర్తు చేశారు. రైతులకు సన్న వడ్లకు క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తున్నాం.. సామాజిక న్యాయం కోసం రాష్ట్రంలో కులగణన చేపట్టామని పేర్కొన్నారు. హామీల వివరాలు కావాలంటే ఇవ్వడానికి మేం సిద్ధమని ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి ప్రకటించారు. దేశంలోనే ఎక్కువ రైతు ఆత్మహత్యలు మహారాష్ట్రలో నమోదు అవుతున్నాయని మహాయతి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. మహారాష్ట్ర అంటే శివాజీ మహారాజ్ గుర్తుకు వస్తారని అన్నారు. ఈ ఎన్నికల్లో మహా వికాస్ అఘాడీ కూటమిని గెలిపించాలని రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ప్రభుత్వం అమలు కానీ హామీలు ఇచ్చిందని మోదీ అన్నారు. మహారాష్ట్ర భాజపా నేతలు తెలంగాణ ప్రభుత్వంపై ఆరోపణలు చేశారు. ప్రధాని కాంగ్రెస్ గ్యారంటీల అమలుపై అబద్దాలు చెబుతున్నారు. ఆయన అబద్దాలు చెప్పడం మానుకోకపోతే మేం నిజాలు చెబుతూనే ఉంటాం. మహారాష్ట్ర ప్రజలకు 6 గ్యారంటీల అమలుపై నిజాలు చెప్పేందుకు వచ్చా. ఇక్కడ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు సంక్షేమాన్ని మరిచాయి. నల్ల చట్టాలు తెచ్చి అదానీ, అంబానీలకు మేలు చేయాలని మోదీ భావించారు. సామాజిక న్యాయం అందించేందుకు తెలంగాణలో కులగణన చేపట్టాం. దేశ చరిత్రలో మహారాష్ట్రకు ప్రత్యేక స్థానం ఉంది. ఇక్కడికి రావాల్సిన 17 మెగా ప్రాజెక్టులు గుజరాత్‌కు వెళ్లాయి. ఇక్కడి ప్రజలను మోసం చేసిన భాజపాను ఎన్నికల్లో ఓడించాలని రేవంత్‌రెడ్డి అన్నారు.

## నెహ్రూ జయంతి నుంచి సోనియా బర్త్‌డే వరకు
### ప్రజాపాలన విజయోత్సవాల నిర్వహణ
### భట్టి అధ్యక్షతన కమిటీ భేటీ

**హైదరాబాద్,నవంబర్9(తెలంగాణ వీణ):**

కాంగ్రెస్ పార్టీ ఏడాది పాలనపై నవంబర్ 14 నుంచి డిసెంబర్ 9 వరకు ప్రజా విజయోత్సవాలు నిర్వహించనున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఏడాదిగా చేసిన పనులను ప్రజలకు వివరించాలని నిర్ణయించారు. ప్రజా విజయోత్సవాలు ఏవిధంగా జరపాలి, ఏ అంశాలపై ప్రచారం చేయాలనే దానిపై విధివిధానాలు రూపొందించేందుకు భట్టి అధ్యక్షతన కేబినెట్ సబ్‌కమిటీ సమావేశమైంది. ఈ మేరకు ఉత్సవాల నిర్వహణపై శనివారం జరిగిన సబ్‌కమిటీ భేటీలో పలు నిర్ణయాలు తీసుకోవడంతోపాటు రోడ్‌మ్యాప్ సిద్ధం చేశారు. దివంగత మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతి రోజున ప్రజా విజయోత్సవాలు ప్రారంభించి.. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత సోనియా గాంధీ పుట్టినరోజు వరకు నిర్వహించే విధంగా ప్రణాళిక రూపొందించింది. విజయోత్సవాల్లో భాగంగా భారీగా సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఈ 25 రోజుల పాటు వివిధ రకాల కార్యక్రమాలతో పాటు పలు కీలక అభివృద్ధి పనులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది. రాష్ట్ర ప్రభుత్వం భవిష్యత్‌లో చేపట్టబోయే కార్యక్రమాలపైనా ప్రజలకు ఈ కార్యక్రమాల ద్వారా వివరించనున్నారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నుంచి మొదలుపెట్టి రాష్ట్ర వ్యాప్తంగా గ్రామస్థాయి వరకు ఈ సంబరాలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. భేటీ అనంతరం భట్టి మాట్లాడుతూ.. 'ప్రజా విజయోత్సవాల్లో భాగంగా ఉస్మానియా ఆస్పత్రి, స్పోర్ట్స్ వర్సిటీకి శంకుస్థాపన చేస్తాం. 28న పారామెడికల్, 16 నర్సింగ్ కళాశాలలను ప్రారంభిస్తాం. ఉత్సవాల్లో భాగంగా పలు కంపెనీలో ఒప్పందాలు చేసుకుంటాం. గ్రూప్-4కు ఎంపికైన వారికి నియామక పత్రాలు అందజేస్తాం. డిసెంబర్ 9న హైదరాబాద్‌లో భారీగా ప్రజా విజయోత్సవాలు నిర్వహిస్తాం' అని తెలిపారు.

# 11,13 తేదీల్లో కుండపోత వర్షాలు

**చెన్నై, నవంబర్ 9 (తెలంగాణ వీణ) :**

బంగాళాఖాతంలో రెండు రోజుల్లో అల్ప పీడనం ఏర్పడనుందని వాతావరణ కేంద్రం అధికారులు ప్రకటించారు. ఈ అల్ప పీడనం వాయుగుండంగా మారే అవకాశాలుండటంతో రాష్ట్రంలో పలు చోట్ల చెదురుమదురుగా వర్షాలు కురుస్తాయన్నారు. ఇదిలా ఉండగా ఈ నెల 11, 13 తేదీల్లో రాజధాని నగరం చెన్నైలో పలు చోట్ల కుండపోత వర్షం కురిసే అవకాశముందని తెలిపారు. ఇక ఈశాన్య బంగాళాఖాతంలో ఏర్పడనున్న అల్ప పీడనం రెండరోజుల్లో పడమటి దిశగా శ్రీలంక తీరం వైపు నెమ్మదిగా కదులుతుందని తెలిపారు. ఈశాన్య అరేబియా సముద్రం పరిసర ప్రాంతాల్లో లక్షద్వీపాల్లో ఉపరితల ఆవర్తనం నెలకొనడటంతో కన్నియాకుమారి, తిరునల్వేలి, తూత్తుకుడి జిల్లాల్లో ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపారు. ఈ నెల 10న కడలూరు, మైలాడుదురై, నాగపట్టినం, తంజావూరు, తిరువారూరు, పుదుకోట జిల్లాల్లో భారీగా వర్షాలు కురుస్తాయన్నారు. ఈ నెల 11, 13 తేదీల్లో చెన్నై, చెంగల్పట్టు కాంచీపురం, తిరువళ్లూరు, రామనాథపురం, పుదుకోట, తంజావూరు, తిరువారూరు, నాగపట్టినం, మైలాడుదురై, కడలూరు, విల్లుపురం జిల్లాల్లో, పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాలలోనూ పలుచోట్ల కుండపోతగా వర్షాలు కురుస్తాయన్నారు. ఈ నెల 12న కన్నియాకుమారి, తిరునల్వేలి, తూత్తుకుడి, తెన్‌కాశి, విరుదునగర్, మదురై, శివగంగ, రామనాథపురం, తంజావూరు, తిరువారూరు, నాగపట్టినం, కడలూరు, మైలాడుదురై తదితర జిల్లాల్లో చెదురుముదురుగా వర్షాలు కురిసే అవకాశాలున్నాయని చెప్పారు.

# రైతులంటే ఎందుకంతా చులకన..?

ఈ సందర్భంగా రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. 20 రోజులైనా కాంగ్రెస్ సర్కారు ధాన్యం కొంటలేదని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. దీంతో కలెక్టర్‌కు ఆయన ఫోన్ చేశారు. అయితే స్విచ్ ఆఫ్ రావడంతో అడిషనల్ కలెక్టర్‌తో మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు సౌకర్యాలు కల్పించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ట్రాన్స్?పోర్టు, బస్తాలు, బస్తా సుతిల్?, హమాలీ చార్జీలు ఇలా మొత్తం కేంద్రమే రాష్ట్రానికి చెల్లిస్తుందన్నారు. సివిల్ సప్లయ్స్ డిపార్ట్‌మెంట్ సహా ఐకేపీ వారికి కూడా కేంద్రమే కమిషన్ ఇస్తున్నదని, రాష్ట్ర సర్కారు కొనుగోళ్ల కోసం ఒకవేళ బ్యాంకు నుంచి అప్పు తీసుకుంటే దాని వడ్డీ కూడా కేంద్రమే చెల్లిస్తుందని తెలిపారు. రైతుల ధాన్యం కొనడంలో రాష్ట్ర సర్కారుకు వచ్చిన ఇబ్బంది ఏంటి?' అని నిలదీశారు. స్థానిక అధికారులు రాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులంటే అంత చులకనా.. అంత నిర్లక్ష్యమా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం వస్తే అందరు పరిగెత్తుతారు.. ఇదేనా రైతంటే ఈ ప్రభుత్వానికి గౌరవం అంటూ ఫైరయ్యారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని చెప్పారు. ప్రభుత్వం ధాన్యం కాంటా చేయకపోవడంతో దళారులు తక్కువ ధరకు రైతుల నుంచి ధాన్యాన్ని కొంటున్నారని విమర్శించారు. ఇంత జరిగినా సంబంధిత అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం ఏంటని అధికారులను నిలదీశారు. ధాన్యం దళారుల పాల్జేసుకుని నష్టపోవడమే రైతులకు దిక్కా అంటూ మండలించారు.

మొదటి పేజీ తరువాయి

# వాన్ని లోపలేద్దాం వీన్ని లోపలేద్దాం అంటే కుదరదు

**గజ్వేల్,నవంబర్9(తెలంగాణ వీణ):**

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారాస నేతలు హైరానా పడాల్సిన అవసరం లేదన్నారు. సమాజాన్ని నిలబెట్టి, నిర్మాణం చేయాల్సిన రాష్ట్ర ప్రభుత్వం.. కూలగొడతామని పిచ్చిపిచ్చి మాటలు మాట్లాడుతోందని మండిపడ్డారు. ప్రజలు బాధ్యత ఇస్తే.. అంతే బరువుతో సేవ చేయాలన్నారు. గతంలో మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలకంటే 90 శాతం ఎక్కువే చేశామని కేసీఆర్ స్పష్టం చేశారు. మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని ఈ సందర్భంగా కేసీఆర్ ధీమా వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో 100 శాతం విజయం మనదే అని తెలిపారు. ఎర్రబెల్లి దయాకర్ రావు వెంట పలువురు నేతలు వచ్చి కెసిఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ.. ఏం కోల్పోయారో ప్రజలకు అర్థమైందని అన్నారు. చాలా గ్యాప్ తరువాత పార్టీ కార్యకర్తలతో మాట్లాడిన గులాబీ దళపతి కేసీఆర్ సంచలన కామెంట్స్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం గురించి తనదైన శైలిలో కామెంట్స్ చేశారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటై 11 నెలలు పూర్తయ్యిందని.. ప్రజలు ఏం కోల్పోయారో వారికి అర్థమైందన్నారు. ప్రస్తుతం జరుగుతున్న పరిస్థితులను ప్రజలు క్షుణ్ణంగా గమనిస్తున్నారని గులాబీ బాస్ కేసీఆర్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ నేతలు హైరానా కావాల్సిన అవసరం లేదన్నారు. పార్టీపై ప్రజలు చాలా విశ్వాసంతో ఉన్నారన్నారు. తెలంగాణలో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తుందని కేసీఆర్ సంపూర్ణ విశ్వాసం వ్యక్తం చేశారు. పాలన అంటే ఒట్టి మాటలతో నడిచేది కాదన్నారు. అధికారంలోకి రాగానే వాణ్ణి లోపల వేయాలి.. వీన్ని లోపల వేయాలని బీఆర్ఎస్ చూడదన్నారు. 'ప్రభుత్వం అంటే అందరినీ కాపాడాలి. సమసమాజ నిర్మాణం చేయాలి. పది మందికి లాభం చేయాలి. ప్రస్తుతం ప్రభుత్వంలో ఉన్నవాళ్లు ఎలా మాట్లాడుతున్నారో.. ఏం చేస్తున్నారో ప్రజలంతా గమనిస్తున్నారని కాంగ్రెస్ ప్రభుత్వం తీరుపై కేసీఆర్ మండిపడ్డారు. అది చేస్తాం.. ఇది చేస్తామని పిచ్చి మాటలు తమకు రావా? అని కేసీఆర్ వ్యాఖ్యానించారు. ప్రజలు మీకు బాధ్యత ఇచ్చింది సేవ చేయడానికా? లేక మాటలతో కాలయాపన చేయడానికా? అని కాంగ్రెస్ ప్రభుత్వం తీరును తూర్పార బట్టారు. తాము తమ పార్టీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల కంటే 90 శాతం ఎక్కువే అమలు చేశామని కేసీఆర్ గుర్తు చేశారు. అడగడని పథకాలు కూడా అమలు చేశామన్నారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో వందశాతం బీఆర్ఎస్ ప్రభుత్వమే వస్తుందని కేసీఆర్ ఉద్ఘాటించారు. అక్రమ కేసులు ఎన్ని పెట్టిన భయపడాల్సిన పని లేదని పార్టీ శ్రేణులకు భరోసా ఇచ్చారు. అరెస్టులకు, కేసులకు భయపడే ప్రసక్తే లేదన్నారు. లీగల్‌గా పోరాడుదామని పార్టీ శ్రేణులకు కేసీఆర్ దిశానిర్దేశం చేశారు. అందరూ కష్టపడి పని చేయాలని కార్యకర్తలు, నాయకులకు సూచించారు. నిజానికి తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ అధికారం కోల్పోయిన తరువాత కేసీఆర్ పూర్తిగా సైలెంట్ అయిపోయారు. ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసి ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌కు పరిమితం అయ్యారు. ఆస్పత్రిలో ఆపరేషన్, విశ్రాంతి కారణంగా కొన్ని నెలలు ఆయన ప్రజలకు దూరంగా ఉన్నారు. ఎంపీ ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ తరఫున ప్రచారం నిర్వహించారు. ఆ ఎన్నికల్లోనూ బీఆర్ఎస్‌కు ఒక్క సీటు రాకపోవడంతో తీవ్ర నైరాశ్యానికి గురయ్యారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఒక రోజు సమావేశానికి హాజరైన కేసీఆర్.. ఆ తరువాత మళ్లీ జాడ లేకుండా పోయారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆయన ప్రజా క్షేత్రంలోకి వచ్చింది లేదు. వచ్చి మాట్లాడింది లేదు. కేసీఆర్ తన వ్యవసాయ క్షేత్రంలోనే ఉంటూ.. పార్టీ ముఖ్యనేతలు వచ్చినప్పుడు కలుస్తూ.. వారికి కీలక సూచనలు చేస్తున్నారు. దాదాపు 5 నెలల తరువాత కేసీఆర్ మళ్లీ తన నోరు విప్పి.. పార్టీ శ్రేణులను ఉద్దేశించి ప్రసంగించారు. కాంగ్రెస్ విధానాలను తప్పుపడుతూ.. తెలంగాణలో వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనంటూ తన పార్టీ క్యాడర్‌లో జోష్ నింపే ప్రయత్నం చేశారు.

మొదటి పేజీ తరువాయి

# మీరు దేశంలో కుల గణన చేపడతారా లేదా

**హైదరాబాద్,నవంబర్9(తెలంగాణ వీణ):**

కులగణనపై మీ అభిప్రాయం ఏమిటో స్పష్టంగా చెప్పాలని కాంగ్రెస్ పార్టీ బిజెపిని డిమాండ్ చేసింది. బిసిల పట్ల మీ వైఖరేంటో చెప్పాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. కుల గణనకు బీజేపీ అనుకూలమా కాదా అన్నది ఆ పార్టీ రాజ్యసభ ఎంపీ డా. లక్ష్మణ్ చెప్పాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. దేశవ్యాప్తంగా సర్వే చేసేందుకు కేంద్ర ప్రభుత్వంపై వత్తిడి తెస్తారా లేదా అని నిలదీశారు. తెలంగాణలో కులగణన సర్వేపై లక్ష్మణ్ అభిప్రాయం చెప్పాలని ప్రశ్నించారు. శనివారం గాంధీ భవన్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియా సమావేశం నిర్వహించారు, ఈ సమావేశంలో బీఆర్ఎస్, బీజేపీ పార్టీలపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఎన్నికల కోసం కులగణన జరుపుతున్నామని బీజేపీ నేతలు అంటున్నారని అన్నారు. సర్వేను అడ్డుకోవాలని చూస్తే లక్ష్మణ్ ద్రోహిగా మిగిలిపోతారని మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు అమలు చేయాలా వద్దా అని నిలదీశారు. బీజేపీ ఎన్నికల్లో పూర్తిగా మతం రంగును పూసిందని ఆరోపించారు. లక్ష్మణ్ మీద గౌరవం ఉండేదని, కానీ ఇప్పుడు ఆ గౌరవాన్ని పోగొట్టుకున్నారని అన్నారు. బలహీన వర్గాలను అవమానించే విధంగా లక్ష్మణ్ మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు బీజేపీ వ్యతిరేకమని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. 'బీజేపీ నేతల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. రాజస్థాన్‌లో రిజర్వేషన్ అమలు చేస్తుంటే హేమంత్ సోరేన్‌ను అరెస్ట్ చేశారు. వీపీ సింగ్ రిజర్వేషన్లు తెస్తే కమండలం పేరు మీద పదవి నుంచి తప్పించారు. బలహీన వర్గాలకు చెందిన మోదీ బీసీల కోసం పదేళ్లలో ఏమైనా చేశారా చెప్పాలి. తెలంగాణలో బీజేపీ బీసీ ముఖ్యమంత్రిని చేస్తామని చెప్పి బీసీ అధ్యక్షుడిని తీసేశారు. సివిల్ సొసైటీలో అందరి అభిప్రాయం తీసుకుని కులగణన చేస్తున్నాం. కులగణనకు అడ్డం పడటానికి బీజేపీ చాలా ప్రయత్నాలు చేస్తుంది. ప్రభుత్వం ఏ డాక్యుమెంట్ అడగట్లేదు. సమాచారాన్ని ప్రభుత్వం గోప్యంగా ఉంచుతుంది. బీఆర్ఎస్ సర్వే చేపట్టలేకపోయింది. మేము చేస్తున్నాం సహకరించండి. మూసీ పరివాహక ప్రాంత ప్రజల జీవన విధానం మార్చాలని సీఎం రేవంత్ రెడ్డి ప్రక్షాళన చేస్తున్నారు. మీరు చేయలేని ప్రక్షాళన మేము చేస్తున్నాం సహకరించాలి.. వీలయితే సపోర్ట్ చేయాలి' అని మంత్రి పొన్నం ప్రబాకర్ అన్నారు. 'మాజీ మంత్రులు హరీష్‌రావు, కేటీఆర్ అన్నట్లు కులగొట్టిన ప్రాంతాలకు వస్తాం. పదేళ్లు అధికారంలో ఉన్న వారు, వారిచ్చిన గ్యారంటీలు ఏమయ్యాయి. ముందుగా చెప్పాలి. కిషన్ రెడ్డి ఏవిధంగా హైదరాబాద్‌కు ఉపయోగపడుతున్నారో టవర్ సర్కిల్ దగ్గర చర్చకు సిద్ధమా అంటే సప్పుడు చేయలేదు. జైలు కట్టినం కేసీఆర్ కుటుంబం అంతా జైలుకే అని బండి సంజయ్ అన్నారు. కేటీఆర్‌ని పామ్‌హౌస్ కేసులో ఎందుకు అరెస్ట్ చేయట్లేదని బండి సంజయ్ అంటున్నారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని మేము అరెస్ట్ చేయం. కేటీఆర్ , కేసీఆర్, హరీష్ రావులను అరెస్ట్ చేస్తామని మేము అనలేదు. పదేళ్లు అధికారంలో ఉండి ఢిల్లీలో దోస్తీ.. గల్లీలో కుస్తీ పట్టింది మీరు కాదా. రాష్ట్ర ప్రయోజనాల కోసం రాబోయే పార్లమెంట్ సెషన్‌లో ఢిల్లీకి వెళ్లి కొట్లాడతాం. తెలంగాణ అభివృద్ధిలో భాగస్వాములుగా ఉండక పోతే మీరు చరిత్ర హీనులుగా మిగిలిపోతారు' అని మంత్రి పొన్నం ప్రభాకర్ ధ్వజమెత్తారు.

# ఆంధ్ర సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో పద్య గాన పోటీలు

## - డా. గజల్ శ్రీనివాస్, అధ్యక్షులు , ఆంధ్ర సారస్వత పరషత్తు

**తెలంగాణ వీణ, అమరావతి :**

ఆంధ్ర సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో 6 సంవత్సరాల నుండి 20 సంవత్సరాల వయస్సు గల వారికి " పద్య గాన పోటీలు" నిర్వహించనున్నట్లు పరిషత్తు అధ్యక్షులు డా.గజల్ శ్రీనివాస్, కార్యదర్శి రెడ్డప్ప ధవేజీ ̄లు తెలిపారు.ఈ పోటీలు 'ప్రహ్లాద విభాగం'గా 6 నుండి 10 సం.లు వయస్సు కలవారు, 'మార్కండేయ విభాగం' గా 11 నుండి 15 సం.లు వయస్సు కలవారు, 'వివేకానంద విభాగం'గా 16 నుండి 20 సం.ల వయస్సు కలవారు మొత్తం మూడు విభాగాలుగా జరుగుతాయని అన్నారు.ఈ పోటీలో పాల్గొనేవారు ఒక పద్యాన్ని రాగయుక్తంగా పాడిన వీడియోని, పేరు, వయసు, తరగతి,ఊరు, ఫోన్ నెంబర్ చెప్పి..92472 72066 కు వాట్సాప్ ద్వారా నవంబర్ 20 వ తేదీ లోపుగా పంపవలసిందిగా కోరారు.ప్రాథమిక పరిశీలనలో ఒక్కొక్క విభాగంలో ఎంపికకాబడిన 30 మంది, అంటే మూడు విభాగాలలో 90 మంది పేర్లను నవంబర్ 30 వ తేదీన తెలియజేయడం జరుగుతుందని తెలిపారు. ప్రాథమిక స్థాయిలో అర్హత పొందిన 90 మంది, డిసెంబర్ 9 వ తేదీ, సోమవారం "గుంటూరులో" నిర్వహించే కార్యక్రమంలో పాల్గొనవలసి ఉంటుందని. ఆరోజు వేదికపై ఒక్కొక్కరు మూడు పద్యాలను విధిగా గానం చేయాలని తెలిపారు. ఒక్కొక్కరి 5 నిమిషాలు సమయం కేటాయించడం జరుగుతుందని . కావలసినవారు సంస్థ ఏర్పాటుచేసిన సహ వాయిద్యాలను ఉపయోగించుకోవచ్చని తెలిపారు.ఒక్కొక్క విభాగంలో ప్రథమ బహుమతిగా 3,116/-లు, ద్వితీయ బహుమతిగా 2,116/-లు,తృతీయ బహుమతిగా 1,116/- లు అందించడం జరుగుతుందని, ప్రోత్సాహక బహుమతులుగా ఒక్కొక్క విభాగంలో ముగ్గురికి 516/- అందించడం జరుగుతుందని తెలిపారు.విజేతలకు ప్రశంసా పత్రంతో పాటు, జ్ఞాపికను కూడా అందించడం జరుగుతుందని.పాల్గొన్న ప్రతి ఒక్కరికీ అభినందన పత్రం అందజేయబడుతుందని నిర్వాహకులు తెలియజేశారు.కార్యక్రమ ముఖ్య సమన్వయ కర్త గా డాక్టర్ ఎస్ ఆర్ ఎస్ కొల్లూరి, సహ సమన్వయకర్తలు గా డాక్టర్ కె.టి పద్మజ , కొత్తగూడెం రాజేష్ పుల్లా రామాంజనేయులు వ్యవహరిస్తారని తెలిపారు.




# కార్తీక మాసం సంధ్భంగా శ్రీ లక్ష్మి నరసింహ స్వామీ దేవాలయం లో కిట కిటలాడుతున్న భక్తులు

**తెలంగాణ వీణ/యాదగిరి గుట్ట:**

యాదగిరి గుట్ట కొండ పైన కార్తీక మాసం సందర్భంగా భక్తులు తండోప తండాలుగా తరలి వచ్చారు సత్యనారాయణ స్వామి వ్రతాలు కళ్యాణ మంటపం లో ఎక్కడ చూసినా భక్త సంద్రం ల స్వామి వారిని దర్శించుకున్నారు





# సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఉర్దూ దినోత్సవ వేడుకలు

## విద్యార్థులకు వ్యాసరచన, ప్రసంగం పోటీల నిర్వహణ

**తెలంగాణ వీణ ఆదిలాబాద్**

జిల్లా ఆదిలాబాద్ లోని స్థానిక ప్రముఖ సేవా సంఘం సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం మౌలానా అబుల్ కలాం ఆజాద్ మరియు అల్లమా ఇక్బాల్ గారి పుట్టినరోజు అలాగే ప్రపంచ ఉర్దూ దినోత్సవ సందర్భంగా స్కూల్ విద్యార్థులకు వ్యాసరచన మరియు ప్రసంగం పోటీలను నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని 8 స్కూళ్లకు సంబంధించిన విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొన్నారు. న్యాయ నిర్ణీతలుగా రఫియా బేగం సాహెబా, పిఎస్ హెచ్ఎం,జిపిఎస్ బాలక్ మందిర్., షేక్ మునీర్ సార్ జిపిఎస్ ఖిలా వ్యవహరించారు. పిల్లలందరూ ఉత్సాహంతో పాల్గొనగా,విద్యార్థుల ప్రసంగాలు ఎంతగానో ఆకర్షించాయి. నిర్వాహకులు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ మౌలానా అబుల్ కలాం ఆజాద్ స్వాతంత్ర సమరయోధుడు, స్వతంత్ర భారత మొదటి విద్యా శాఖ మంత్రిగా పని చేశారన్నారు. యువత సామాజికంగా,విద్యాపరంగా ఎదగాలని దేశాభివృద్ధిలో పాలుపంచుకోవాలని, మనం భారతదేశంలో పుట్టాము, ఈ దేశపు మట్టిలోనే కలిసి పోతామని అబుల్ కలాం అజాద్ అన్నారని చెప్పారు. కవి అల్లమా ముహమ్మద్ ఇక్బాల్ తన శాయరీ ద్వారా ఖురాన్, హదీస్ బోధనలను ప్రజలందరికీ అర్థమయ్యేలా వ్రాసారని చెప్పారు. సారే జహాసే అచ్చా అనే గేయం చిరకాలం భారతీయుల మనసులో నిలిచిపోతుందన్నారు.ఈ కార్యక్రమంలో జిహెచ్ఎస్ గర్ల్స్ ఆదిలాబాద్, జడ్పిహెచ్ఎస్ కేఆర్కే కాలనీ, జిపిఎస్ ఖానాపూర్ ఉర్దూ మీడియం, జిహెచ్ఎస్ బాలక్ మందిర్ ఆదిలాబాద్, జిహెచ్ఎస్ ఖిలా, ఆదిలాబాద్., ప్రభుత్వ గజిటెడ్ హై స్కూల్ ఆదిలాబాద్, నౌనిహాల్ ఉర్దూ హై స్కూల్,షమా ఉర్దూ స్కూల్, అజీజియా ఉర్దూ స్కూల్...ఉర్దూ మీడియం పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. సేవా ఫౌండేషన్ అధ్యక్షులు ఖాజా సిరాజుద్దీన్ మాట్లాడుతూ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ఈ నెల 11వ తేదీన రవితేజ హొటల్ పక్కన న్యూ బజరంగ్ ఫంక్షన్ హాల్ యందు మధ్యాహ్నం రెండు గంటలకు బహుమతులను అందజేయడం జరుగుతుందని, అలాగే ఉర్దూ ప్రభుత్వ, ప్రైవేటు ఉపాధ్యాయులకు, ఉర్దూ మీడియా జర్నలిస్టులకు సన్మానించడం జరుగుతుందని తెలిపారు.కావున ఆదిలాబాద్ లోని పాఠశాలల విద్యార్థులు,తల్లిదండ్రులు, యువకులు, సామాజికవేత్తలు అందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.సేవా ఫౌండేషన్ సభ్యులు రిజ్వాన్ ఖాన్,సజీల్ మెమన్, సమీర్ ఖాన్,తబ్రేజ్ ఖాన్, షేక్ ఇస్మాయిల్, హాఫీస్ షేక్ అబ్రార్, ముహమ్మద్ జావిద్,తలహా,ఇక్బాల్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.







# టీడీపీకి పూర్వ వైభవం రానుంది

**తెలంగాణవీణ, కాప్రా**

రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీకి పూర్వ వైభవం రానుందని ఆపార్టీ శ్రేణులు ధీమా వ్యక్తం చేశారు. శనివారం కాప్రా సర్కిల్ పరిధిలోని నేతాజీనగర్ లో రెండో రోజు పార్టీ తెలుగు యువత ఆధ్వర్యంలో పార్టీ సభ్యత్వనమోదు కార్యక్రామన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 200 మంది పార్టీ సభ్యత్వాలు నమోదైనట్లు, సభ్యత్వం పొందిన కార్యకర్తలకు రూ. 5 లక్షల ప్రమాధ భీమా సౌకర్యాన్ని కల్పిస్తోందన్నారు. తెలంగాణలో టీడీపీ అధికార పగ్గాలు చేపట్టే దిశగా పార్టీ కార్యకర్తలు సమయాత్తం అవుతున్నారన్నారు. తెలంగాణలో టీడీపీ పార్టీకి పూర్వ వైభవం రానుందని, ఆంధ్ర ప్రదేశ్? రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రావడంతో తెలంగాణలో టీడీపీ శ్రేణులలో నూతనోత్సహం పెరిందన్నారు. కార్యక్రమంలో శివానంద్, శివశంకర్, హరి, చైతన్య, దినీష్, నరేష్, సంతోష్, కార్తీక్, రమేష్ లు పాల్గొన్నారు.




# నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**తెలంగాణవీణ, కాప్రా**

విద్యుత్ మరమ్మతుల కారణంగా కుషాయిగూడ 33/11 కెవి సబ్ స్టేషన్ పరిధిలోని కుషాయిగూడ 11 కెవి విద్యుత్ ఫీడర్ పరిధిలోని నార్త్ కమల నగర్ ఏపీఐఐసీ కాలనీ ఇండస్ట్రియల్ ఏరియా పెద్ద బోర్వెల్ ఏరియా తులసి హాస్పిటల్ ఏరియా ప్రాంతాలలో ఈనెల 9 ఆదివారం ఉదయం 11 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల 30 నిమిషాల వరకు విద్యుత్ సరఫరా లో అంతరాయం కలుగుతుందని అందుకు ప్రజలు సహకరించాలని కుషాయిగూడ విద్యుత్ ఏఈ రామకృష్ణ కోరారు.

# ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలి

## - జిల్లా కలెక్టర్

**తెలంగాణ వీణ నిర్మల్ నవంబర్ 09**

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు.శనివారం నిర్మల్ రూరల్ మండలంలోని కొండాపూర్ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఈ సంద్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఓటరు జాబితాలో ఏవైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే నవంబర్ 08, 09 (అనగా శని, ఆదివారాలు) న అన్ని పోలింగ్ బూత్ లలో బూత్ స్థాయి అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఓటరుగా నమోదు, పేరు, చిరునామా, తదితర వివరాల్లో తప్పులు ఉన్నట్లయితే తమ అభ్యంతరాలను అధికారులకు ఆధారాలతో తెలుపవచ్చునన్నారు. జనవరి 01, 2025 నాటికి 18 ఏండ్లు నిండబోవు యువతి యువకులు ఫారం నెంబర్ 6 తో ఓటు హక్కును నమోదు చేసుకోవచ్చునన్నారు. కొత్తగా ఓటరు జాబితాలో పేరు నమోదు చేయుటకు ఫారం-6, ఓటరు జాబితాలో అభ్యంతరాలకు ఫారం-7, జాబితాలో మీ చిరునామా, సవరణలు చేయుటకు ఫారం-8 ద్వారా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. అంతకుముందు పాఠశాలను పరిశీలించి, విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని అధికారులకు, ఉపాధ్యాయులను కలెక్టర్ ఆదేశించారు. త్రాగునీరు అందించాలని, మరుగుదొడ్లకు అవసరమైన మరమ్మత్తులు చేపట్టాలని, పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డిఆర్ఓ రత్న కళ్యాణి, బూత్ స్థాయి అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# హ్యాబ్సిగూడ లో సెక్యూర్ ప్యాకర్స్ అండ్ మూవర్స్ నూతన కార్యాలయం

**తెలంగాణ వీణ/తార్నాక:**

హబ్సిగూడలో సెక్యూర్ ప్యాకర్స్ అండ్ మూవర్స్ ఆఫీస్ ని నూతనంగా ప్రారంభించారు.. 30 సంవత్సరాల అనుభవంతో గల ఈ ప్యాకెట్స్ అండ్ మూవర్స్ కస్టమర్ కస్టమర్ల మందన పొందింది. వినియోగదారుల పార్సల్ కు సంబంధించి పూర్తి బాధ్యత మాది అంటూ, నిర్వాహకులు అయినా రవికుమార్ తెలిపారు. కస్టమర్ల సామాన్లతో పాటు కస్టమర్లు వెళ్లడానికి కారు ట్రావెలింగ్ సదుపాయం అని అన్నారు. మిగిలిన ప్యాకర్స్ అండ్ మూమెంట్స్ పోల్చుకుంటే మంచి స్కిల్స్ ఉన్న వర్కర్స్ మావద్ద ప్రత్యేకత....




# ఎడిటర్ శ్రీధర్ కు తెలుగు టి.వి రచయితల సంఘం ప్రతిభాపురస్కారము

**తెలంగాణ వీణ, హైదరాబాద్ :**

తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో తెలుగు టెలివిజన్ రచయితల సంఘం, భారత్ కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాల కార్యక్రమం రవీంద్రభారతి ఆడిటోరియంలో ఘనంగా జరిగింది. విశేష ప్రతిభ కనబరిచిన ఎస్.ఏ.టి.శ్రీధర్ కు తెలుగు టి.వి రచయితల ప్రతిభాపురస్కారము అందజేశారు.ఈ కార్యక్రమంలో రచయితలు వెనిగళ్ళ రాంబాబు, మౌనశ్రీ మాలిక్ , ,డైరెక్టర్ బాబ్జీ, రసమయి రాము, తెలుగు టి.వి రచయితల సంఘం అధ్యక్షుడు ప్రేమరాజ్, పాల్గొన్నారు.. టెలివిజన్ ఫెడరేషన్ అధ్యక్షులు నాగబాల సురేష్ అధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఇలా ప్రతీ సంవత్సరం ప్రతిభా పురస్కారాలతో ప్రోత్సహించడం చాలా గొప్ప విషయమని వక్తలు కొనియాడారు...



# సమగ్ర సర్వే కి సహకరించండి

## మాజీ బోర్డ్ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్

**తెలంగాణ వీణ / కంటోన్మెంట్**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర సర్వే కి ప్రజలందరు సహకరించాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్ సూచించారు.శనివారం సమగ్ర సర్వే ఎన్యుమరేటర్లు జంపన ప్రతాప్ నివాసంలో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా జంపన ప్రతాప్ మాట్లాడుతూ సర్వే కోసం ఇంటికి వచ్చిన అధికారులపై దాడులు చేయకుండా వారు అడిగిన వివరాలను తెలపాలని కోరారు. సర్వే ఎన్యుమరేటర్లు కూడ ఇళ్లకు వెళ్ళినప్పుడు ఇంటి వారితో మర్యాదగా ప్రవర్తించాలని. సర్వే ను సక్రమంగా చేయాలని అన్నారు. తమ కుటుంబ సభ్యులతో పాటు సోదరుడి కుటుంబ సభ్యుల వివరాలు, ఇతర వివరాలను తెలిపామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ధఫేదార్ విజయ్, ఎన్యుమరేటర్లు పుష్పలత,అనూష పాల్గొన్నారు.



# ఘనంగా సంతోషిమానగర్లో సదర్ వేడుకలు

## పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు

**తెలంగాణ వీణ, మల్కాజ్గిరి...**

వినాయక్ నగర్ డివిజన్ పరిధిలోని సంతోషిమానగర్ లో సదర్ వేడుకలలో మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు బర్ల నరేష్ యాదవ్,కార్పొరేటర్ ప్రేమ్ కుమార్ వెంకటేష్ యాదవ్, సతీష్ కుమార్, ఎస్ ఆర్ ప్రసాద్,సంతోష్ రాందాస్,వినోద్ యాదవ్, వెంకటేశ్వర్ రావు,రఘు యాదవ్,సందీప్ గౌడ్,సంపత్ గౌడ్,చరణ్ జిత్ గౌడ్,ఇస్తరి తదితరులు పాల్గొన్నారు



# ఆర్ సి సి పైప్ లైన్ పనులు ప్రారంభం

**తెలంగాణ వీణ, మల్కాజిగిరిః**

డివిజన్ లోని ప్రతి కాలనీ అభివృద్ధి కోసం కృషి చేస్తానని మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి తెలిపారు. శనివారం గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని రామంజనేయ నగర్ లో 22 లక్షలు వ్యయంతో ఆర్ సి సి పైప్ లైన్ పనులను మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి స్థానిక కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ , అడ్డగుట్ట కార్పోరేటర్ లింగాని ప్రసన్న శ్రీనివాస్ ప్రాంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ మల్కాజిగిరి ప్రజలు రుణం తీర్చుకోవడం కోసం మల్కాజిగిరిలోని ప్రతి డివిజన్ అభివృద్ధి కోసం కృషి చేస్తానని తెలిపారు.కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ మాట్లాడుతూ డివిజన్లో ని ప్రతి కాలనీ మౌలిక వసతుల కోసం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి సహకారంతో అభివృద్ధికి కృషి చేస్తానని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు , వాటర్ వర్క్స్ అధికారులు , గౌతమ్ నగర్ డివిజన్ నాయకులు , మహిళా నాయకులు కాలనీ వాసులు పాల్గొన్నారు.



# శ్రీ లక్ష్మి నరసింహ స్వామీ దర్శించుకున్న హై కోర్టు తెలంగాణ జస్టిస్ పుల్లా కార్తీక్..

**తెలంగాణ వీణ/యాదగిరిగుట్ట:**

యాదగిరి శ్రీ లక్ష్మి నరసింహ స్వామీ వారిని తెలంగాణ హై కోర్టు జస్టిస్ పుల్లా కార్తీక్ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయ అర్చకులు వేదపండితులు వేదమంత్రాలతో ఆయనకు ఆశీర్వచనం చేశారు.అనంతరం ఈఓ భాస్కరరావు స్వామివారి అభిషేక మహా ప్రసాదం లడ్డూ అందజేశారు..



# ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమస్యలు పరిష్కరించాలి

## ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు





**తెలంగాణ వీణ – కూకట్ పల్లి**

ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, ప్రజా సమస్యలను పరిష్కరించాలని, రోడ్లు, డ్రైనేజీ పనులను చేపట్టాలని అధికారులను కోరిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కెపిహెచ్బి కాలనీలోని శ్రీలా అపార్ట్మెంట్ వెళ్లే మార్గంలో డ్రైనేజీ నీళ్లు, వరద నీరు నిల్చుపోవడం అదేవిధంగా, మలేషియన్ టౌన్షిప్ లో అధిక వర్షాలు వచ్చినప్పుడు, వర్షపు నీరు, డ్రైనేజీ నీరు నిలిచిపోవడం వల్ల, దుర్వాసనతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నామని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు ఫిర్యాదు చేశారు. కాలనీ అసోసియేషన్ల ఫిర్యాదుల మేరకు, స్థానిక కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు తో కలిసి, శ్రీలా అపార్ట్మెంట్ మార్గాన్ని మరియు మలేషియన్ టౌన్షిప్ ప్రాంతాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ, శ్రీలా అపార్ట్మెంట్ వెళ్లే మార్గాన్ని వర్షపు నీరు, డ్రైనేజీ నీరు వెళుటకు సంభందించిన సమస్యను స్థల యజమానులతో మాట్లాడి, పరిష్కారం చేస్తామని, అదేవిధంగా మలేషియన్ టౌన్షిప్ లోని పలు అపార్ట్మెంట్లో డ్రైనేజీ నీళ్లు నిలిచిపోవడం వల్ల, వాసనలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు కాలనీవాసులతో సమన్వయం చేసుకొని, డ్రైనేజీ నీరు, మరియు వర్షపు నీరు వెళ్ళుటకు పరిష్కారం చేయాలని అధికారులను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు కృష్ణారెడ్డి, సాయిబాబా చౌదరి , మలేషియన్ టౌన్షిప్ అధ్యక్షులు సాయి చౌదరి, కాకర్ల సురేష్ ,ఆదినారాయణ, రాజేష్ , మరియు కాలనీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

## కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు





**తెలంగాణ వీణ – కూకట్ పల్లి**

హైదర్ నగర్ డివిజన్ పరిధిలోని, జై భారత్ నగర్ లో నెలకొన్న పలు సమస్యలు మరియు వాటి పరిష్కారానికై తీసుకోవాల్సిన చర్యలపై, చేపట్టవలసిన పలు అభివృద్ధి పనులపై జిహెచ్ఎంసి అధికారులతో, కాలనీ వాసులతో కలిసి పర్యటించిన కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు, ఈ సందర్బంగా కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు మాట్లాడుతూ, జై భారత్ నగర్ కాలనీ వాసులు, ఎదుర్కొంటున్న ఇబ్బందులను, సమస్యలను పరిగణలోకి తీసుకోని, వారి విజ్ఞప్తి మేరకు, కాలనీలలో పాదయాత్ర చేపట్టడం జరిగిందని , ప్రజా సమస్యలే పరిష్కార ధ్యేయంగా ముందుకు వెళ్తున్నామని, సంతులిత, సమగ్ర అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తున్నామని కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు పేర్కొన్నారు. అదేవిధంగా కాలనీ వాసులు అందరూ కలిసి, కాలనీ అభివృద్ధి లో భాగస్వాములు కావాలని, కాలనీ వాసులందరి సమిష్టి కృషి తో ఆదర్శవంతమైన కాలనీ గా తీర్చిదిద్దుతామని కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు పేర్కొన్నారు. ఏ చిన్న సమస్య ఐన తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని, ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని అదేవిధంగా డివిజన్ లో పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా కృషి చేస్తామని ఈ సందర్బంగా కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు తెలిపారు,

ఈ కార్యక్రమంలో అధికారులు ఏఈ రాజీవ్, వర్క్ ఇన్స్పెక్టర్ మహదేవ్ కాలనీ వాసులు కుమార స్వామి, మహేష్, ప్రభాకర్ రావు, సాంబశివరావు, సురేష్, వెంకటేష్, శ్రీనివాస రావు, సరంగా పాణి, కృష్ణ రావు, నర్సయ్య రాఘవేంద్ర రావు, భాస్కర్ రెడ్డి, శ్రీధర్, నాయకులు నిరంజన్ గౌడ్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ సాయి నగర్ లో కార్పొరేటర్ రాజ్యలక్ష్మి పర్యటన

**తెలంగాణ వీణ, మల్కాజిగిరి..**

వినాయక నగర్ డివిజన్ పరిధిలోని శ్రీ సాయి నగర్ లో కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి పర్యటించారు. కాలనీవాసులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెంటనే స్పందించిన కార్పొరేటర్ పర్యటించి కాలనీలో సమస్యలు అడిగి తెలుసుకున్నారు వీలైనంత త్వరలో బోర్ వెల్ రిపేరు, కొత్త పోల్స్ , త్రీ ఫేస్ లైన్స్, డ్రైనేజ్ మరమత్తులు, చేపిస్తామని కాలిన వాసులకు హామీ ఇచ్చారు.. సంబంధిత అధికారులు పిలిపించి వారికి అక్కడి సమస్యలను వివరించి, వెంటనే మరమత్తు పనులు చేపట్టాలని కార్పొరేటర్ తెలిపారు.. ఈ కార్యక్రమము లో విద్యుత్ అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు, వాటర్ వర్క్స్ మేనేజర్లు కృష్ణ ప్రసాద్, ఉదయ్ పాల్గొన్నారు. అనంతరం సాయినగర్ లోని ప్రభుత్వ స్కూల్, అంగన్వాడీ కేంద్రాని పరిశీలించారు.స్కూల్ దగ్గర పరిశుభ్యం పనులు దోమల మందు వితరణలు రెగ్యులర్గా చేపట్టాలనిసంబంధిత అధుకారులకు ఫోన్ చేసి మాట్లాడడం జరిగిందని కార్పొరేటర్ తెలిపారు.ఈ స్కూల్ వద్ద తరచుగా పోలీస్ పెట్రోలింగ్ కూడా చెయ్యాలని పోలీస్ సీఐ సందీప్ కుమార్ కి ఫోన్ చేసి చూప్పడం జరిగిందన్నారుప్రతి ఆఫీసరు సానుకూలముగా స్పందించారు.ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు



ఉపేందర్, కార్యదర్శి రమేష్, జగదీష్ చారీ, చంద్రమౌళి,వెంకటేష్, రమాదేవి,సుజాత,పద్మ,సుమతీ,సంగీత ,సోమేష్,ధనరాజు,పండు,కృష్ణ,రాజేష్, ఓం ప్రకాష్, సాయి సురేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు...

# టైగర్ జితేందర్ రెడ్డి సినిమా ప్రతి ఒక్కరూ చూడాలి ఏబీవీపీ

## స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ విద్యానగర్ జిల్లా కన్వీనర్ హరి ప్రసాద్.

**తెలంగాణ వీణ/ఓయూ:**

ఏబీవీపి విద్యార్థి నాయకుడు జగిత్యాల టైగర్ జితేందర్ రెడ్డి అన్న కథాచిత్రమైనటువంటి జితేందర్ రెడ్డి సినిమా ప్రతి ఒక్కరు చూడాలని అదేవిధంగా విద్యార్థిని విద్యార్థులు అందరు కూడా తప్పక చూడవలసిన సినిమా, దేశ వ్యతిరేక శక్తులైనటువంటి నక్సలైట్ల చేతిలో 72 బుల్లెట్లు తన శరీరంలో దిగినప్పటికీ వెనకడుగు వేయకుండా జాతీయవాద సిద్ధాంతం కోసం పోరాడి భారత్ మాతాకీ జై, వందేమాతరం అనే నినాదాలతో రక్తపు ముద్దయి నేలపై ఒరిగిన ఒక వీరుడి కథ కాబట్టి అందరూ కూడా కుటుంబ సమేతంగా విచ్చేసి సినిమా ని చూడాలని స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ విద్యానగర్ జిల్లా కన్వీనర్ హరి ప్రసాద్ అన్నారు.







# సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

## మున్సిపల్ కార్మికుల సమస్యల గురించి గేట్ మీటింగ్

**తెలంగాణ వీణ ప్రతినిధి మహేందర్**

శనివారం ఉదయం 5 గం.లకు ఆదిలాబాద్ మున్సిపల్ కార్మికుల గెట్ మీటింగ్లో ముఖ్యతిథిగా పాల్గొన్న ఎ ఐ టి యు సి జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ ,కార్మికులతో మాట్లాడుతు రాష్ట్ర ప్రభుత్వం మన మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలను మరియు మన మున్సిపల్ కార్మికులు ఎదురుకుంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించి జిల్లా కేంద్రం లో ఈ ఎస్ ఐ ఆస్పిటల్ ను ఏర్పాటు చేసి మన మున్సిపల్ కార్ముకుల ఆరోగ్యం పట్ల దృష్టి సరించే వరకు మన కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించేంత వరకు పోరాటాలు చేయాల్సిందేనని కార్మికులకు తెల్పి రాష్ట్ర ప్రభుత్వం కు డిమాండ్ చేస్తూ ఈ రోజు 12:గం.లకు చేపట్టబోయే మున్సిపల్ కార్మికుల మహా ధర్నా కార్యక్రమం ప్రతి ఒక్క కార్మికులు ధర్నా లో పాల్గొని ధర్నా ను విజవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు కార్మికులకు ఇచ్చిన హామీలను హమాలు చేసేంతవరకు పోరాటాలు ఆగవని మీడియా ద్వారా రాష్ట్ర ప్రభుత్వం కు తెలియ పరిచిన ఏ ఐ టి యు సి జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ ఈ కార్యక్రమం లో మున్సిపల్ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మంతెన కాంతారావ్ జిల్లా అధ్యక్షుడు మెరుగు చిరంజీవి నాయకులు కార్మికులు ఉన్నారు



## పలు కుటుంబాలను పరామర్శించిన గోక గణేశ్ రెడ్డి

**తెలంగాణ వీణ డివిజన్ ప్రతినిది మహేందర్**

అదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం ఉండం గ్రామములో దేవల్ల శంకరమ్మ యొక్క ఇల్లు కరెంట్ సర్క్యూట్తో పూర్తిగా కాలిపోయినది వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రభుత్వపరంగా ఇందిరమ్మ ఇల్లు ఇచ్చి ఆదుకుంటామని ధైర్యం చెప్పిన మాజీ జెడ్పిటిసి గోక గణేష్ రెడ్డి ,మాజీ ఎంపీపీ కళ్యాణం లక్ష్మి రాజేశ్వర్ , రామచందర్ దేశ్ముక్, పోతయ్య, మాజీ సర్పంచ్ లక్ష్మన్న,మైనార్టీ సెల్ ప్రెసిడెంట్ రఫిక్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు నిట్య డి అశోక్, సురేందర్ అప్సర్ తదితరులు ఉన్నారు




## సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే.. కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**తెలంగాణ వీణ ముస్తాబాద్**

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా ప్రతి కుటుంబం వివరాలు తప్పనిసరిగా సేకరించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో శనివారం ప్రారంభం కాగా, తంగళ్ళపల్లి మండల కేంద్రంలో కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎన్యుమరేటర్ బ్లాక్ పరిధిలోని 0060, 0061/%ూ/ూ% లో అధికారులు, సిబ్బంది సర్వే చేస్తుండగా, కలెక్టర్ పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సర్వే మొదలు పెట్టామని తెలిపారు. ప్రభుత్వం అందించిన ప్రొఫార్మా ప్రకారం అన్ని కుటుంబాల వివరాలు తీసుకోవాలని ఆదేశించారు. సర్వేకు వచ్చే వారికి ప్రతి కుటుంబం వారి సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ సమాచారం ప్రతి పథకానికి, భవిష్యత్తులో చేపట్టనున్న ప్రణాళికలకు ఎంతో కీలకమని స్పష్టం చేశారు. సర్వే చేయనున్న గ్రామాలు, వార్డ్ ల సమాచారం స్థానికులకు ఇవ్వాలని ఆదేశించారు. తాసిల్దార్ జయంత్ కుమార్, ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

### వీసీ ద్వారా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

**తెలంగాణ వీణ ముస్తాబాద్**






నేటి నుంచి ఇంటింటి సర్వే ప్రారంభమవుతున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్లు ఎన్యూమరేటర్లతో సర్వే ప్రక్రియను పకడ్బందీగా నమోదు చేసే విధంగా తగు చర్యలు చేపట్టాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. శనివారం నుండి ప్రారంభమైన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ మరియు కుల సమగ్ర సర్వే ఇంటింటి కుటుంబ సర్వే పై సీ.ఎస్. శాంతికుమారి, ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియాలతో కలిసి జిల్లా కలెక్టర్లుతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ నుండి కలెక్టర్ సందీప్ కుమార్ ఝ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ శనివారం నుంచి సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వే ప్రారంభ మవుతున్న నేపథ్యంలో ప్రజలకు అనేక సందేహాలు వస్తుంటాయని నివృత్తి చేస్తూ ముందుకు సాగాలని సూచించారు. ఎలాంటి సందేహాలున్నా ఎన్యూమరేటర్లు కలెక్టర్ల దృష్టికి తేవాలని పేర్కొన్నారు. సర్వే పై ప్రజలతో మమేకం అయితే సందేహాలు ఏమిటో తెలుస్తాయని తక్షణమే నివృత్తి చేయడానికి చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రజలు ఎలాంటి అపోహలు పడకుండా ఎన్యూమరేటర్లుకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సర్వే ప్రక్రియలో ప్రజల పట్ల ఎన్యూమరేటర్లు భాద్యతగా వ్యవహరించాలని సూచించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు సర్వేలో భాగస్వాములు అయ్యేలా ఆహ్వానించాలని తెలిపారు. సమగ్ర కుటుంబ సర్వే చాలా మంచి కార్యక్రమమని ప్రజల సమగ్ర సమాచారం సేకరణ వల్ల అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అందించి వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేయడానికి దోహదపడతాయని తెలిపారు. హౌస్ లిస్టింగ్ సర్వే దిగ్విజయంగా నిర్వహించారని, అదే ఉత్సాహంతో సర్వే ఆసాంతం పూర్తి అయ్యే వరకు పకడ్బందీగా నిర్వహించాలని, సర్వే ప్రక్రియలో ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ ఎలాంటి ఇబ్బంది లేకుండా ముందుకు తీసుకెళుతున్నారని భాగస్వామ్యం అయిన కలెక్టర్లను, ఎన్యూమరేటర్లు ను, ప్రణాళికా శాఖ అధికారులను డిప్యూటీ సీఎం అభినందించారు. ఇదే రీతిలో కుటుంబ సర్వేను విజయవంతంగా నిర్వహించాలని కోరారు. మనదేశంలో జరిగే అతిపెద్ద కార్యక్రమని, సిబ్బంది నిబద్ధత, అంకితభావంతో సర్వే విజయవంతం చేయాలని అన్నారు. యావత్తు దేశం మన రాష్ట్రం చేపడుతున్న సర్వేను గమనిస్తుందని నిబద్ధతతో పూర్తి చేసి ఆదర్శంగా నిలవాలని వివరించారు. దేశంలో ప్రగతిశీల భావాలను, కార్యక్రమాలను వ్యాప్తి చేయడానికి ఈ సర్వే ఉపయోగపడుతుందని తెలిపారు. ఏవైనా సమస్యలు తలెత్తితే జిల్లా కలెక్టర్లు, ప్రణాళిక శాఖ ముఖ్య కార్యదర్శి, ఇతర ఉన్నత అధికారుల దృష్టికి తీసుకురావాలని, వచ్చిన సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తెలిపారు. సర్వే సమాచారం గ్రామస్థాయిలోని చిట్ట చివరి ఇంటికి చేరే విధంగా విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని, గ్రామాలు, పట్టణాల ప్రధాన కూడళ్ళలో హోర్డింగ్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. కలెక్టర్లతో పాటు అన్ని స్థాయిలలోని అధికారులు సర్వే ప్రక్రియను పరిశీలిస్తూ సిబ్బందికి తగు, సలహాలు సూచనలు ఇవ్వాలని, ప్రధానంగా పట్టణాలపై దృష్టి పెట్టాలని కోరారు. అనంతరం కలెక్టర్ సందిప్ కుమార్ ఝ అధికారులతో మాట్లాడుతూ సర్వే కొరకు జారీ చేసిన బుక్ లెట్ లోనీ అంశాలలో ఎలాంటి అనుమానాలు, సందేహాలకు తావు లేకుండా ప్రజల నుండి ఖచ్చితమైన సమాచారం సేకరణతో వివరాలు నమోదు చేయాలని సూచించారు. సర్వే ప్రక్రియను సూపర్ వైజర్లు, మండల ప్రత్యేక అధికారులు పర్యవేక్షణ చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సర్వే ప్రక్రియను నిబద్ధతతో నిష్పక్షపాతంగా ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా నిర్వహించాలని అన్నారు. ప్రజలు సర్వే సిబ్బందికి సహకరించి సమగ్ర సమాచారం ఇవ్వాలని సూచించారు. సర్వే కు ఒక రోజు ముందు గ్రామాలు, పట్టణంలో విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు. ప్రజల నుండి సేకరించిన సమాచారం పూర్తిగా గోప్యంగా ఉంచడం జరుగుతుందని ఖచ్చితమైన సమాచారం ఇవ్వాలని సూచించారు. సర్వేపై ప్రజలు ఎలాంటి దుష్ప్రచారాలు నమ్మొద్దని పేర్కొన్నారు. ఏలాంటి సందేహాలు ఉన్న ఎంపిడిఓ, తహశీల్దార్ల దృష్టికి తేవాలని తెలిపారు. సర్వే కు నియమించిన ఎన్యూమరేటర్లు ఉపాధ్యాయులు, అంగన్ వాడి, కార్యదర్శులు, డిఆర్డీఓ సిబ్బంది మాత్రమే ఇంటింటికి వస్తారని, ఇతరులు వస్తే సమాచారం ఇవ్వొద్దని ప్రజలకు సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాస చారి తదితరులు పాల్గొన్నారు.

G9 TV తెలుగు
తెలంగాణ వీణ
నిజం నిగ్గు తేలుద్దాం..
తెలుగు దినపత్రిక
విలేకరులు కావలెను
అతి కొద్ది కాలంలోనే ప్రజలకు ప్రజాప్రతినిధులకు వారధి గా ప్రద్యంపబడుతున్న
GS9TV కేబుల్ ఛానల్, తెలంగాణ వీణ తెలుగు దినపత్రికకు
అన్నీ జిల్లాల నుండి విలేకరులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి.
సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లు
8328209811
9703024024






తెలంగాణ వీణ
నిజం నిగ్గు తేలుద్దాం..
జనరల్
10 ఆదివారం నవంబర్ 2024

# సమగ్ర కుటుంబ సర్వే పై జిల్లా కలెక్టర్లతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**తెలంగాణ వీణ ఆదిలాబాద్**

సామాజిక,ఆర్థిక,విద్య,ఉపాధి,రాజకీయ ,కుల సమగ్ర సర్వే ప్రక్రియ శనివారం నుండి ప్రారంభం కాగా ఈ సమగ్ర సర్వే పై క్యాంపు కార్యాలయం నుండి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి,ప్రణాళిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానీయా లతో కలిసి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో క్యాంప్ కార్యాలయం నుండి పాల్గొన్న జిల్లా కలెక్టర్ రాజర్షి షా.ఇళ్ళ జాబితా (హౌస్ లిస్టింగ్) పూర్తి చేసుకుని నేటి నుంచి ఇంటింటి సర్వే ప్రారంభమవుతున్న సందర్భంగా కలెక్టర్లు ఎన్యుమరేటర్లు పకడ్బందీగా సమగ్ర సర్వే సమాచారం నమోదు చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు తెలిపారు.ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ శనివారం నుంచి ఇంటింటి సర్వే ప్రారంభమవుతున్న సందర్భంగా ప్రజలకు అనేక సందేహాలు వస్తుంటాయని నివృత్తి చేస్తూ ముందుకు సాగాలని సూచించారు.ఎలాంటి సందేహాలు ఉన్నా ఎన్యుమరేటర్లు కలెక్టర్ల దృష్టికి తేవాలని పేర్కొన్నారు.ప్రజలు ఎలాంటి అపోహలు పడకుండా ఎన్యుమరేటర్లు కు సమాచారం ఇవ్వాలని సూచించారు.సర్వే ప్రక్రియలో ప్రజల పట్ల ఎన్యుమరేటర్లు భాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.మంత్రులు,ఎమ్మెల్యేలు సర్వేలో భాగస్వాములయ్యేల చూడాలని ప్రజల సమగ్ర సమాచారం సేకరణ వల్ల అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలు అందించి వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేయడానికి దోహదపడతాయని తెలిపారు. హౌస్ లిస్టింగ్ సర్వే దిగ్విజయంగా నిర్వహించారని,అదే ఉత్సాహంతో సర్వే ఆసాంతం పూర్తి అయ్యే వరకు పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు.హౌస్ లిస్టింగ్,సర్వే ప్రక్రియలో ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ ఎలాంటి ఇబ్బంది లేకుండా ముందుకు తీసుకెళుతున్నారని భాగస్వామ్యం అయిన కలెక్టర్లను,ఎన్యుమరేటర్లు ను, ప్రణాళికా శాఖ అధికారులను డిప్యూటీ సీఎం అభినందించారు.ఇదే రీతిలో సమగ్ర కుటుంబ సర్వేను విజయవంతంగా నిర్వహించాలని కోరారు. మనదేశంలో జరిగే అతిపెద్ద కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని,సిబ్బంది నిబద్ధత,అంకితభావంతో సర్వే విజయవంతం చేయాలని అన్నారు.యావత్తు దేశం మన రాష్ట్రం చేపడుతున్న సర్వేను గమనిస్తుందని నిబద్ధతతో పూర్తి చేసి ఆదర్శంగా నిలవాలని సూచించారు.ఏమైన సమస్యలు,సందేహాలు ఉంటే జిల్లా కలెక్టర్లు,అధికారుల దృష్టికి తీసుకురావాలని,వచ్చిన సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తెలిపారు.సర్వే సమాచారం గ్రామ స్థాయిలో,మునిసిపాలిటి లో ప్రతీ ఇంటికి చేరే విధంగా విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని,గ్రామాలు,పట్టణాల ప్రధాన కూడళ్ళలో హోర్డింగ్స్ ఏర్పాటు చేయాలని సూచించారు.కలెక్టర్లతో పాటు సంబంధిత అధికారులు సర్వే ప్రక్రియ ను పరిశీలిస్తూ సిబ్బందికి తగు,సలహాలు సూచనలు ఇవ్వాలని,ప్రధానంగా పట్టణాల పై దృష్టి సారించాలని కోరారు.అనంతరం జిల్లా కలెక్టర్ రాజర్షి షా సిపిఓ,డిపిఓ,డీఈఓ,మున్సిపల్ కమిషనర్,మండల సర్వే టీమ్స్ ఎంపిడిఓ,సి, సూపర్వైజర్,ఎన్యుమరేటర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడుతూ సర్వే కొరకు జారీ చేసిన బుక్ లెట్ లో మొత్తం 56 అంశాలున్నాయని ఎలాంటి అనుమానాలు,సందేహాలకు తావు లేకుండా ప్రజల నుండి ఖచ్చితమైన సమాచారం సేకరణతో నమోదులు చేయాలని సూచించారు.సర్వే ప్రక్రియను సూపర్ వైజర్లు,మండల ప్రత్యేక అధికారులు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు.ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సర్వే ప్రక్రియను నిబద్ధతతో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని అన్నారు.ప్రజలు సర్వే సిబ్బందికి సహకరించి సమగ్ర సమాచారం ఇవ్వాలని సూచించారు.సర్వే కు ఒక రోజు ముందు గ్రామాలు,పట్టణంలో విస్తృత ప్రచారం చేయాలని,ప్రజల నుండి సేకరించిన సమాచారం పూర్తిగా గోప్యంగా ఉంచడం జరుగుతుందని,ఏలాంటి సందేహాలు ఉన్న ఎంపిడిఓ,తహాశీల్దార్ల దృష్టికి తేవాలని తెలిపారు. సర్వే కు నియమించిన ఎన్యూమరేటర్ల కు ఎంపిడిఓ, మున్సిపల్ కమిషనర్లు ఫారం లో ఉన్న 56 అంశాల నమోదు పై అవగాహన కల్పించాలని,సర్వే చేయు క్రమం లో మండల టీమ్ లీడర్లు సర్వే తీరును పరిశీలించి పొరపాట్లు దొర్లకుండా నివృత్తి చేయాలని అన్నారు. ఫారం పూరించేటప్పుడు ఎలాంటి కొట్టివేతలు లేకుండా పూరించాలని స్పష్టం చేశారు.ఎంపిడిఓ, మున్సిపల్ కమిషనర్ సర్వే పూర్తయిన అనంతరం పూరించిన ఫారాలను భద్రపరచాలని ఆదేశించారు.గ్రామాల్లోని ప్రజలు పొలాలకు వెళ్ళకముందు ఇంట్లో ఉన్న సమయంలో ఉదయం 7.00 గంటలకు సర్వే ప్రారంభించాలని అన్నారు.సర్వే రిపోర్ట్ మధ్యహ్నం 1.00 గంటలకు, సాయంత్రం 5.00 గంటలకు సమర్పించాలని,ఈ సందర్భంగా కంప్యూటరరైజ్డ్ చేయడానికి 395 మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించడం జరిగిందనీ,తప్పులు లేకుండా డేటా ఎంట్రీ చేయాలనీ అన్నారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామలా దేవి, ఆర్డిఓ వినోద్ కుమార్, సీఈఓ జితేందర్ రెడ్డి,డిఈఓ ప్రణీత,మున్సిపల్ కమిషనర్ వివిఎన్ రాజు, డీపీవో శ్రీలత, డీఎల్పిఓ ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

# సమన్యాయం కోసమే సమగ్ర కుటుంబ సర్వే

## - కాంగ్రెస్ ఇన్చార్జి ప్రొద్దుటూరి వినయ్ రెడ్డి

**తెలంగాణ వీణ ప్రతినిధి ఆర్మూర్ టౌన్**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర సర్వేతో రాష్ట్ర ప్రజలందరికీ సమన్యాయం జరుగుతుందని ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్చార్జి పొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం ఆర్మూర్ పట్టణ కేంద్రంలో సమగ్ర సర్వేలో ఆయన పాల్గొని స్థానిక ప్రజలకు సమగ్ర సర్వే పై అవగాహన కలిగించారు. ఈ సర్వే తో సమగ్ర కుటుంబ సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులగణన సమగ్ర సర్వే బుక్ లెట్ పై ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆర్మూర్ పట్టణ పదవ వార్డులో అధికారులు సమగ్ర సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ వన్నెల్ దేవి లావణ్య అయ్యప్ప శ్రీనివాస్, ఏఎంసి చైర్మన్ సాయిబాబా గౌడ్, వైస్ చైర్మన్ షేక్ మున్ను, మున్సిపల్ కమిషనర్ ఏ రాజు, మున్సిపల్ కౌన్సిలర్లు కొంతం మంజుల మురళి, వనం శేఖర్, భాగ్యలక్ష్మి శివ, మాజీ వైస్ చైర్మన్ లింగ గౌడ్, నాయకులు ఎస్.కె బబ్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# జడ్పీఎస్ఎస్ స్కూల్ లక్ష్మీపూర్ లో షీ టీం అవగాహన కార్యక్రమం

**తెలంగాణ వీణ ఆదిలాబాద్**

జిల్లా ఆదిలాబాద్,జైనథ్ మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో గల జడ్పీఎస్ఎస్ స్కూల్ యందు శనివారం షీ టీం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.విద్యార్థిని విద్యార్థులకు షీ టీం విధుల పైన మరియు సైబర్ క్రైమ్ పైన అవగాహన కల్పించారు.విద్యార్థులను ఎవరైనా ఆకతాయిలు స్కూల్కు వచ్చే సమయంలో సెలవు అనంతరం వెళ్తున్న సమయంలో రోడ్డు మీద వెంటపడిన,వేధించిన,స్ట్రీట్ హరాస్మెంట్ చేసిన ఎడల చట్టరీత్యా నేరమని,అటువంటి వారిపై చర్యలు తప్పవని షీ టీం స్పష్టంగా తెలియపరిచింది.అలాంటి వారు వెంటనే మా షీ టీం నెంబర్ 8712659953 కి కాల్ చేయాలని సూచించారు.ఎవరయినా కంప్లైంట్ చేసినా మీ పేరు వివరాలు గోప్యంగా మా వద్ద ఉంచబడతాయని తెలిపారు. సైబర్ క్రైమ్ గురించి అత్యధికంగా జరుగుతున్న నేరాల గురించి ఆదిలాబాద్‌లోని స్టాక్ పెట్టుబడి మోసం, రైతుల రుణ మాఫీ నకిలీ కాల్స్ మోసాలు, డ్రగ్ పార్శిల్ గురించి నకిలీ పోలీసు వీడియో కాల్,పార్ట్‌టైమ్ జాబ్ మోసం లాటరీ మోసం, ఏపీకే మోసం ఎస్బిఐ బ్యాంక్ ఖాతాల పునరుద్ధరణ మోసం మొదలైన వాటికీ సంబంధించి టోల్ ఫ్రీ నంబర్ 1930 అని తెలిపారు.గోల్డెన్ అవర్‌కు కాల్ చేయడం యొక్క ప్రాముఖ్యతను వివరించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్,ఆదిలాబాద్ షీ టీమ్ బృందం సుశీల,సత్య మోహన్,విద్యార్థినీ విద్యార్థులు ఉన్నారు.



# ఎర్ర జెండా పోరాటాలు దేశ ప్రజలకు ఆయుధం- సిపి(ఐ)ఎం


**తెలంగాణ వీణ ప్రతినిధి మందమర్రి**



సిపిఐ(యం) మంచిర్యాల జిల్లా మూడవ మహాసభలు మందమర్రి పట్టణంలో సిఇఆర్ క్లబ్ లో నిర్వహించడం జరిగింది. మహాసభలో సిపి(ఐ)ఎం జిల్లా నూతన కమిటీ 13 మందితో ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ(యం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మళ్ళీ అధికారంలోకి రావడంతో దేశం మొత్తం ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలని జమిలి ఎన్నికలు జరిపించాలని చూస్తుందని ఇలా చేయడం ప్రజాస్వామ్యానికి పెద్ద ప్రమాదమని అన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన 6 గ్యారెంటీ హామీలను అమలు చేయకుండా హైడ్రా పేరుతో చెరువులు, కుంటలు, నాళాలు అక్రమణ గురైన వాటిని తొలగించాలని ఒకటి రెండు పెద్ద పెద్ద కన్వెన్షన్లు తీసేసి తర్వాత ఇల్లు కట్టుకున్న పేద మధ్యతరగతి కుటుంబాల ఇండ్లను ధ్వంసం చేసిందని ధ్వంసం చేసిన ఇండ్లను కట్టుకోవడానికి అనుమతులు ఇచ్చింది ప్రభుత్వ అధికారులే కదా అనుమతులు ఇచ్చిన ప్రభుత్వం పైన అధికారుల పైన ఏమైనా చర్యలు తీసుకున్నారా సిపి(ఐ)ఎం ప్రశ్నిస్తున్నామని అన్నారు. గ్రూప్ 1 పరీక్షల్లో కూడా ప్రభుత్వం అనాలోచితంగా ముందుకు వెళ్తుందని రాష్ట్ర ప్రభుత్వం రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమలు ఇంకా ఏదైనా చేసే ముందు ప్రతి పక్షాలతో మాట్లాడి సలహాలు సూచనలు తీసుకుని చేస్తామని చెప్పినా ముఖ్యమంత్రి ఇప్పటివరకు ప్రతిపక్షాలతో మాట్లాడలేదని అన్నారు. అదే విధంగా జిల్లాలో ఉన్నటువంటి ముఖ్యమైన సమస్యలు కాళేశ్వరం, ప్రాణహిత ముప్పు నీటి సమస్యకు పరిష్కారం చూపాలని, శ్రావణ పల్లి బొగ్గు బావులను సింగరేణికే ఇవ్వాలని, పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలి, సంక్షేమ హాస్టల్స్ లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం, స్కిల్ వర్కర్లను సింగరేణి కాంట్రాక్టు అసంఘటితరంగా కార్మికులకు 73వ షెడ్యూల్ ఎంప్లాయిస్ జీవోలను గెజిట్ చేసి అమలు చేయాలని కాంట్రాక్టు కార్మికులకు ఉద్యోగ భద్రత, పెన్షన్, ప్రమాద బీమా తదిత సౌకర్యాలు కల్పించాలి సిపి(ఐ)ఎం పార్టీ డిమాండ్ చేస్తున్నామని అన్నారు. ఈ సమావేశంలో సిపి(ఐ)ఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పాలడుగు భాస్కర్, జి రాములు, భూపాల్, పైళ్ల ఆశయ రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.









తెలంగాణ వీణ
10 ఆదివారం నవంబర్ 2024

# క్రీడలు



## మూడు ఫార్మాట్లకు ముగ్గురు కెప్టెన్లు!?

ఒకప్పటితో పోల్చి చూస్తే ఇప్పుడు క్రికెట్లో ఎన్నో రకాల మార్పులు వచ్చాయి అన్న విషయం తెలిసిందే. క్రికెట్లో అధునాతన టెక్నాలజీని అందుబాటులో రావడంతో ఆ టెక్నాలజీని ఉపయోగించుకుని మరింత ఖచ్చితమైన నిర్ణయాలు తీసుకోగలుగుతున్నారు.అదే సమయంలో ఆటగాళ్ల విషయంలో ఎప్పటికప్పుడు కఠినమైన రూల్స్ కూడా తీసుకురావడం చేస్తూ ఉంటుంది ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ అన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ప్రస్తుతం వరల్డ్ క్రికెట్లో ఒక సరికొత్త ట్రెండ్ కొనసాగుతోంది. ఏకంగా ప్రతి దేశానికి చెందిన క్రికెట్ బోర్డు తమ దేశంలో మూడు ఫార్మాట్లకు ముగ్గురు కెప్టెన్లను నియమిస్తుంది. ఒకప్పటిలా మూడు ఫార్మాట్లకు కలిపి ఒకే కెప్టెన్ ఒకే కోచ్ ఉండడం అస్సలు ఎక్కడ చూడలేకపోతున్నాము. అన్ని దేశాల క్రికెట్ జట్లకు కూడా మూడు ఫార్మాట్లకు ముగ్గురు కెప్టెన్లు ముగ్గురు ప్రత్యేకమైన హెడ్ కోచ్ కూడా ఉండడం జరుగుతూ ఉంది. అయితే టీమిండియా మాత్రం ఇలాంటి ధోరణికి ఇప్పుడిప్పుడే అలవాటు పడుతుంది. మొన్నటికి మొన్నటి టి20 ఫార్మాట్ కు సూర్య కుమార్ యాదవ్ ను.. టెస్ట్ వన్డే ఫార్మాట్లకు రోహిత్ శర్మని కెప్టెన్ గా కొనసాగించింది. అయితే మూడు ఫార్మాట్లకు ఒకే హెడ్ కోచ్ ఉండేలా చూసుకుంది. కానీ ఇప్పుడు బీసీసీఐ ఈ విషయంలో సంచలన నిర్ణయం తీసుకుంది అన్నది తెలుస్తుంది. వేర్వేరు ఫార్మాట్లకు వేర్వేరు హెడ్ కోచ్లను నియమించాలని బిసిసిఐ ఆలోచనలు ఉందట. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో కూడా భారత్ ఓడి పోతే టెస్టులకు టి20 లకు వన్డేలకు వేరువేరుగా హెడ్ కోచ్లను నియమించాలని భావిస్తున్నట్లు ఒకటాక్ ప్రస్తుతం క్రికెట్ వర్గాల్లో చక్కర్లు కొడుతుంది. కాగా భారత క్రికెట్ చరిత్రలో ఇప్పటి వరకు వైట్ బాల్ రెడ్ బాల్ జట్లకు బీసీసీఐ వేరువేరు ప్రత్యేకమైన హెడ్ కోచ్ లను ఎన్నడూ నియమించలేదు అని చెప్పాలి. మరి ఇప్పుడు ఏం జరగబోతుందో చూడాలి.

## రెండో టీ20లో తుదిజట్టులో మార్పులు

దక్షిణాఫ్రికాతో జరుగుతున్న నాలుగు టీ20ల సిరీస్‌ను భారత్ ఘనంగా బోణీ కొట్టింది. దర్బన్ వేదికగా సౌతాఫ్రికాతో జరిగిన తొలి టీ20లో టీమిండియా 61 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఆల్‌రౌండ్ షోతో సత్తాచాటి సఫారీలను చిత్తు చేసింది. అదే జోరులో సెయింట్ జార్జ్ పార్క్ వేదికగా ఆదివారం జరగనున్న రెండో టీ20లోనూ గెలవాలని టీమిండియా పట్టుదలతో సిద్ధమవుతోంది. మరోవైపు రేపటి మ్యాచ్‌లో గెలిచి భారత్ ఆధిక్యాన్ని 1-1తో సమం చేయాలని సౌతాఫ్రికా ఉవ్విళ్లూరుతోంది. భారత కాలమాన ప్రకారం ఆదివారం రాత్రి 7.30 గంటలకు మ్యాచ్ ఆరంభం కానుంది. అయితే రెండో టీ20లో తుదిజట్టులో మార్పులు చేయాలని కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, కోచ్ వీవీఎస్ లక్ష్మణ్ భావిస్తున్నారు. విన్నింగ్ కాంబినేషన్ మార్చడానికి ఇష్టం లేకపోయినా యువ ఆటగాళ్లకు అవకాశం ఇవ్వాలని చూస్తున్నారు. ఈ క్రమంలో కేకేఆర్ రిటైన్డ్ ప్లేయర్, ఆల్‌రౌండర్ రమన్‌దీప్ సింగ్ అంతర్జాతీయ క్రికెట్‌లోకి అరంగేట్రం చేయనున్నాడు. స్పిన్ ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ స్థానంలో అతను జట్టులోకి రానున్నాడు. తొలి టీ20లో భారత్ 202 పరుగులు భారీ స్కోరు చేసినప్పటికీ చివరి 6 ఓవర్లలో40 పరుగులే చేసింది. పేస్‌తో పాటు హార్డ్ హిట్టర్ రమన్‌దీప్ జట్టులో ఉంటే భారత్ మరింత భారీ స్కోరు చేయగలదని టీమిండియా మేనేజ్మెంట్ భావిస్తోంది. అంతేగాక తొలి టీ20లో అక్షర్ పటేల్‌ను బౌలింగ్ పరంగా సూర్య ఎక్కువగా ఉపయోగించలేదు. ఒక్క ఓవర్ మాత్రమే బౌలింగ్ ఇచ్చాడు. వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్‌తో స్పిన్ బౌలింగ్ బలంగా ఉండటంతో రమన్‌దీప్‌కు అవకాశం ఇవ్వాలని చూస్తున్నారు. రమన్‌దీప్ బ్యాటింగ్, బౌలింగ్‌తో పాటు అద్భుతమైన ఫీల్డర్. కాగా, భారత్ - దక్షిణాఫ్రికా ఇప్పటివరకు 28 మ్యాచ్‌లు ఆడగా టీమిండియా 16 మ్యాచ్‌ల్లో, సఫారీలు 11 పోరుల్లో గెలిచాయి. అయితే సెయింట్ జార్జ్ పార్క్ వేదికగా జరిగిన చివరి మ్యాచ్‌లో భారత్‌పై దక్షిణాఫ్రికాదే పైచేయి.సౌతాఫ్రికాతో తొలి టీ20కి భారత తుది జట్టు (అంచనా)అభిషేక్ శర్మ, సంజు శాంసన్, సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), తిలక్ వర్మ, రింకూ సింగ్, హార్దిక్ పాండ్య, రమన్‌దీప్ సింగ్, రవి బిష్ణోయ్, వరుణ్ చక్రవర్తి, అర్షదీప్ సింగ్, అవేశ్ ఖాన్.భారత జట్టు: సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, సంజు శాంసన్, రింకూ సింగ్, తిలక్ వర్మ, జితేశ్ శర్మ, హార్దిక్ పాండ్య, అక్షర్ పటేల్, రమన్‌దీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్, అర్షదీప్ సింగ్, విజయ్‌కుమార్ వైశాక్, అవేశ్ ఖాన్, యశ్ దయాల్.

## ఆస్ట్రేలియా చేతిలో భారత్‌కు మరో ఓటమి!

ఆస్ట్రేలియా పర్యటనను భారత్-ఏ జట్టు పేలవంగా ముగించింది. మెల్‌బోర్న్ వేదికగా జరిగిన రెండో అనధికారిక టెస్టులోనూ ఓటమిపాలైంది. ఆరు వికెట్ల తేడాతో ఘోర పరాజయాన్ని చవిచూసింది. 168 పరుగుల లక్ష్యాన్ని ఆస్ట్రేలియా నాలుగు వికెట్లు కోల్పోయి 47.5 ఓవర్లలో ఛేదించింది. సామ్ కొనస్టాస్ (73 నాటౌట్‌బీ 128 బంతుల్లో, 7 ఫోర్లు, 1 సిక్సర్), వెబ్‌స్టర్ (46 నాటౌట్‌బీ 66 బంతుల్లో, 6 ఫోర్లు) సత్తాచాటారు. భారత బౌలర్లలో ప్రసిధ్ కృష్ణ రెండు వికెట్లు, ముకేశ్ కుమార్, తనుష్ కొటియన్ తలో వికెట్ తీశారు. అయితే ఛేదనలో ఆస్ట్రేలియా తొలి ఓవర్‌లోనే రెండు వికెట్లు కోల్పోయింది. మార్కస్ హారిస్, కామెరూన్ బెన్‌క్రాఫ్ట్‌లను ప్రసిధ్ కృష్ణ గోల్డెన్ డకౌట్ చేశాడు. కొద్దిసేపటికి ముకేశ్, తనుష్ కూడా వికెట్లు పడగొట్టడంతో ఆసీస్ 73 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయింది. అయితే ఈ దశలో బ్యాటింగ్‌కు వచ్చిన వెబ్‌స్టర్‌తో కలిసి సామ్ ఇన్నింగ్స్ చక్కదిద్దారు. వీరిద్దరు సాధికారికంగా ఆడుతూ ఆసీస్‌ను విజయతీరాలకు చేర్చారు. అంతకుముందు 73/5 ఇవాళ ఆటను ఆరంభించిన భారత్-ఏ జట్టు 77.5 ఓవర్లలో 229 పరుగులు చేసింది. ధ్రువ్ జురెల్ (68బీ 122 బంతుల్లో, 5 ఫోర్లు) మరోసారి జట్టును ఆదుకున్నాడు. రెండో ఇన్నింగ్స్‌లో అర్ధశతకంతో సత్తాచాటాడు. తనుష్ కొటియన్ (44బీ 84 బంతుల్లో, 4 ఫోర్లు, 1 సిక్సర్), ప్రసిధ్ కృష్ణ (29బీ 43 బంతుల్లో, 5 ఫోర్లు) కీలక పరుగులు చేశారు. కాగా, భారత్-ఏ తొలి ఇన్నింగ్స్‌లో 161 పరుగులకే కుప్పకూలింది. వికెట్ కీపర్ ధ్రువ్ జురెల్ (80) పోరాడాడు. నీజర్ నాలుగు వికెట్లు, వెబ్‌స్టర్ మూడు వికెట్లు తీశారు. ఆస్ట్రేలియా మొదటి ఇన్నింగ్స్‌లో 223 పరుగులు చేసింది. ప్రసిధ్ కృష్ణ నాలుగు వికెట్లు, ముకేశ్ కుమార్, ఖలీల్ అహ్మద్ రెండు వికెట్లతో పడగొట్టారు. మార్కస్ హారిస్ (70) టాప్ స్కోరర్.



## శ్రీలంకతో టీ20 సిరీస్‌కు అభిషేక్‌కు దక్కని చోటు

ఐపీఎల్-2024లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తరపున విధ్వంసానికి కేరాఫ్ అడ్రస్‌గా మారాడు అభిషేక్ శర్మ. యువరాజ్ సింగ్ ప్రియ శిష్యుడిగా అంచనాలకు మించి రాణించాడు. ఎస్ఆర్‌హెచ్ ఫైనల్స్‌కు చేర్చడంలో కీలకపాత్ర పోషించాడు. మగధీర సినిమాలో హీరో ఎలివేషన్‌లా.. 30 బంతులకు మించి ఆడకుండా ప్రత్యర్థి పతానాన్ని శాసించాడు. అదే జోరులో టీమిండియాలో చోటు సంపాదించాడు. జింబాబ్వే పర్యటనకు ఎంపికయ్యాడు. అయితే అరంగేట్రంలో డకౌటయ్యాడు. కానీ తర్వాతి మ్యాచ్‌లో సెంచరీతో కదం తొక్కాడు. కానీ ఆ తర్వాత అభిషేక్ రాణించలేకపోతున్నాడు. అనంతరం ఆరు మ్యాచ్‌ల్లో అతడు సాధించిన అత్యధిక స్కోరు 16 మాత్రమే. రెండు సార్లు సింగిల్ డిజిట్‌కే పరిమతమయ్యాడు. అయితే టీమిండియా కోచ్‌గా గౌతమ్ గంభీర్ బాధ్యతలు అందుకున్న అనంతరం అభిషేక్‌కు శ్రీలంకతో టీ20 సిరీస్‌కు చోటు దక్కలేదు. అయితే వరల్డ్ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్స్‌కు భారత్ గురిపెట్టడంతో యశస్వీ జైస్వాల్, శుభ్‌మన్ గిల్ రెడ్ బాల్ క్రికెట్‌కు పరిమితమయ్యారు. ఈ క్రమంలో బంగ్లాదేశ్ సిరీస్‌కు చోటు దక్కించుకున్నాడు. కానీ అదే తడబాటు. మూడు మ్యాచ్‌ల్లో దాదాపు 12 సగటుతో 35 పరుగులే చేశాడు. దక్షిణాఫ్రికా పర్యటనలో అయినా తిరిగి గాడినపడతానుకుంటే మళ్లీ పేలవమైన ప్రదర్శన చేశాడు. ఏడు పరుగులకు పెవిలియన్ బాట పట్టాడు. టీ20 వరల్డ్ కప్ -2024 అనంతరం రోహిత్ శర్మ పొట్టి ఫార్మాట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. దీంతో దశాబ్ద కాలం తర్వాత భారత జట్టులో ఓపెనర్ స్థానం ఖాళీ అయ్యింది. ఈ స్థానంలో 24 ఏళ్ల అభిషేక్ శర్మ కుదురుకుంటే భారత క్రికెట్ భవిష్యత్‌కు కూడా ఢోకా ఉండదని సెలక్టర్లు, బీసీసీఐ భావించి వరుస అవకాశాలు ఇస్తున్నారు. కానీ అభిషేక్ చేజేతులా సువర్ణ అవకాశాల్ని నేలపాలు చేసుకుంటున్నాడు. ఓ ఓపెనింగ్ స్థానానికి యశస్వీ జైస్వాల్ దాదాపుగా ఖరారయ్యాడు. ఇక మిగిలిన ఒక స్థానానికి పోటీ గట్టిగానే ఉంది. శుభ్‌మన్ గిల్, సంజు శాంసన్, రుతురాజ్ గైక్వాడ్ ప్రధానంగా రేసులో ఉన్నారు. అయితే గైక్వాడ్‌కు అవకాశాలు దక్కట్లేదు. గిల్ టెస్టులతో బిజీగా ఉన్నాడు. ఈ దశలో మంచి ఇన్నింగ్స్‌లతో అభిషేక్ ఓపెనర్ స్థానాన్ని సుస్థిరం చేసుకోవచ్చు. కానీ పేలవమైన ఆట ఆడుతున్నాడు. మరోవైపు సంజు శాంసన్ వరుస సెంచరీలతో రోహిత్ స్థానానికి వారుసుడిగా ప్రకటించకుంటున్నాడు.



## గంభీర్‌పై బీసీసీఐకి ఫిర్యాదు చేసిన ప్లేయర్లు!



టీమిండియా కోచ్ గౌతమ్ గంభీర్‌కు మరో సమస్య ఎదురైంది. భారత జట్టులో కొందరు ఆటగాళ్లు గౌతమ్ గంభీర్ అభిప్రాయాలు, వ్యూహాలతో ఏకీభవించట్లేదు. ఈ విషయంపై బీసీసీఐకి ఫిర్యాదు కూడా వెళ్లింది. సొంతగడ్డపై న్యూజిలాండ్ చేతిలో ఘోరపరాజయానికి గంభీర్‌ను బాధ్యుడిని చేస్తున్న తరుణంలో.. ఈ కొత్త అలజడి అతని కోచ్ పదవికే ఎసరు పెట్టేలా ఉంది. భారత జట్టుకు వైట్ బాల్-రెడ్ బాల్‌కు వేర్వేరుగా కోచ్‌లను నియమించే యోచనలో బీసీసీఐ ఉంది. 91 ఏళ్ల భారత క్రికెట్ చరిత్రలో స్వదేశంలో మూడు లేదా అంతకంటే ఎక్కువ మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో టీమిండియా వైట్ వాష్‌కు గురైన సంగతి తెలిసిందే. కివీస్‌తో టెస్టు సిరీస్‌ను 0-3తో కోల్పోయి ఈ అపకీర్తి మూటగట్టుకుంది. ఈ ఘోర పరాభవంపై బీసీసీఐ సుదీర్ఘంగా ఆరు గంటల పాటు సమీక్ష నిర్వహించింది. కెప్టెన్ రోహిత్ శర్మ, కోచ్ గంభీర్, సెలక్షన్ కమిటీ ఛైర్మన్ అగార్కర్‌ను బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీ, కార్యదర్శి జై షా ప్రశ్నలు సంధించారు. రెండో టెస్టులో విఫలమైనప్పటికీ మూడో టెస్టులోనూ స్పిన్ పిచ్‌ను ఎందుకు సిద్ధం చేశారు? ఆ మ్యాచ్‌లో బుమ్రాను ఎందుకు తప్పించారు? ఇక ఆస్ట్రేలియా పర్యటనకు ప్రణాళికలు ఏంటి? అని గంభీర్-రోహిత్‌ను బీసీసీఐ ప్రశ్నించింది. అయితే సమీక్షతో సంబంధం లేకుండా గంభీర్‌పై బీసీసీఐకి భారత జట్టులోని కీలక ఆటగాళ్లు ఫిర్యాదు చేశారని జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి. ఆటగాళ్ల పేర్లను పేర్కొనకుండా జట్టులోని ప్రధాన సీనియర్లు అని తెలిపాయి. జట్టు వ్యూహాల్లో గంభీర్‌తో విభేదాలు వస్తున్నట్లు సీనియర్లు పేర్కొన్నారని రాసుకొచ్చాయి. కాగా, గౌతమ్ గంభీర్‌కు నవంబర్ 22 నుంచి ఆస్ట్రేలియాతో జరగనున్న బోర్డర్ గవాస్కర్ ట్రోఫీని బీసీసీఐ చివరి అవకాశంగా ఇచ్చినట్లు తెలుస్తోంది. కంగారూల గడ్డపై ఆస్ట్రేలియాను ఓడించకపోతే గంభీర్‌ను కోచ్‌గా టెస్టు ఫార్మాట్ నుంచి తప్పించాలని భావిస్తోంది. గంభీర్ స్థానంలో ఎన్సీఏ డైరెక్టర్ వీవీఎస్ లక్ష్మణ్‌ను నియమించాలని యోచిస్తోంది. ఆస్ట్రేలియాతో సిరీస్‌లో భారత్ విఫలమైతే కోచ్‌తో పాటు సీనియర్ల ఆటగాళ్లపై వేటు విధించాలని బీసీసీఐ భావిస్తున్నట్లు సమాచారం.

## బంగ్లాదేశ్ నడ్డి విరిచిన డేంజరస్ స్పిన్నర్..





శారజాలో జరిగిన తొలి వన్డే మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌పై అఫ్గానిస్తాన్ 92 పరుగుల తేడాతో అద్భుత విజయం సాధించింది. 18 ఏళ్ల యువ క్రికెటర్ అల్లా గజన్‌ఫర్ 6 వికెట్లు పడగొట్టి ఈ విజయానికి కీలక పాత్ర పోషించాడు.అతను కేవలం 6.3 ఓవర్లలో 26 పరుగులు ఇచ్చి 6 వికెట్లు తీయడం విశేషం. అతని అద్భుత బౌలింగ్‌తో బంగ్లాదేశ్ మిడిల్ ఆర్డర్, లోవర్ ఆర్డర్ కుప్పకూలిపోయింది. అల్లా గజన్‌ఫర్ స్పిన్ మంత్రజాలం రెండు భాగాలుగా విడిపోయింది. కానీ అతని చివరి 2.3 ఓవర్లు బంగ్లాదేశ్‌కు కష్టకాలం మొదలుపెట్టాయి. ఈ 14 బంతుల్లో అతను 5 వికెట్లు పడగొట్టడంతో బంగ్లాదేశ్ 132/3 నుంచి కేవలం 143 పరుగులకు ఆలౌటైంది. ఈ అనూహ్య పతనంలో బంగ్లాదేశ్ చివరి 7 వికెట్లను కేవలం 4 ఓవర్లలో 11 పరుగులకు కోల్పోయింది. అల్లా గజన్‌ఫర్ అద్భుత ప్రదర్శనతో అఫ్గానిస్తాన్ అద్భుత విజయాన్ని సాధించింది. అఫ్గానిస్తాన్, బంగ్లాదేశ్ మధ్య వన్డే మ్యాచ్‌లో అల్లాహ్ ఘజనఫర్ యువ ఆఫ్‌స్పిన్నర్ అద్భుతమైన ప్రదర్శనకు అందరూ ఆశ్చర్యపోయారు. ఆయన తీసిన 6 వికెట్లు అఫ్గానిస్తాన్, బంగ్లాదేశ్ మధ్య జరిగిన వన్డే మ్యాచ్‌ల చరిత్రలో ఒక కొత్త రికార్డు. ఇంతకు ముందు ఈ రికార్డు బంగ్లాదేశ్‌కు చెందిన షకిబ్ అల్ హసన్ పేరిట ఉంది. ఆయన 2019 వరల్డ్ కప్‌లో సౌతాంప్టన్‌లో జరిగిన మ్యాచ్‌లో 5 వికెట్లు తీసి ఈ రికార్డును సృష్టించారు. అఫ్గానిస్తాన్ తరపున మొహమ్మద్ నబి బంగ్లాదేశ్‌కు చెందిన నజ్ముల్ హొస్సెయిన్ షాంటోను 47 పరుగులకు అవుట్ చేసిన తర్వాత, అల్లాహ్ ఘజనఫర్ బౌలింగ్‌కు వచ్చారు. ఆయన వెంటనే మెహిదీ హసన్‌ను అవుట్ చేసి బంగ్లాదేశ్ జట్టుపై ఒత్తిడి పెంచారు. ఆ తర్వాత ఆయన ముష్ఫిఖుర్ రహీమ్‌ను స్టంపింగ్ ద్వారా, రిషాద్ హొస్సెయిన్‌ను ఎల్బీడబ్ల్యూగా, తస్కిన్ అహ్మద్‌ను గోల్డెన్ డక్‌గా అవుట్ చేసి బంగ్లాదేశ్ జట్టును కుంగదీశారు. చివరగా షరీఫుల్ ఇస్లాంను అవుట్ చేసి తన వికెట్ల సంఖ్యను ఆరుకు చేర్చారు. అల్లాహ్ ఘజనఫర్ అఫ్గానిస్తాన్ క్రికెట్ జట్టుకు ఒక కొత్త ఆశగా మారుతున్నాడు. ఎత్తైన శరీరం, కుడి చేతితో విసరే ఆఫ్‌స్పిన్ బౌలింగ్‌తో ప్రత్యేకత కలిగిన అల్లా గజన్‌ఫర్, 2024 మార్చిలో అయర్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌తో అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగుపెట్టాడు. తన మొదటి రెండు మ్యాచ్‌లలో వికెట్లు పడగొట్టలేకపోయినప్పటికీ, సెప్టెంబర్‌లో దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో 20 పరుగులకు 3 వికెట్లు తీసి అద్భుత ప్రదర్శన చేశాడు. ఆ మ్యాచ్‌లో రెండు మెయిడెన్ ఓవర్లు కూడా వేశాడు.అల్లా గజన్‌ఫర్ తన అన్ని వన్డే మ్యాచ్‌లు శారజాలోనే ఆడాడు. ఆరు మ్యాచ్‌లలో 10 వికెట్లు తీశాడు. బంగ్లాదేశ్‌పై తాను చేసిన అద్భుత ప్రదర్శన అతని కెరీర్‌లో ఒక మలుపు. అతను అఫ్గానిస్తాన్ క్రికెట్ జట్టు భవిష్యత్‌లో టాలెంటెడ్ స్టార్ గా మారే అవకాశం ఉంది.

# మళ్లీ డాక్టరే పెళ్లిచేసుకోనున్న క్రిష్

టాలీవుడ్ దర్శకుడు జాగర్లమూడి కృష్ణ (క్రిష్) పెళ్లి పీటలు ఎక్కబోతున్నట్లు వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. గమ్యం సినిమాతో టాలీవుడ్‌లో మెగాఫోన్ పట్టిన క్రిష్ ఆ తర్వాత వేదం, కంచె, కొండపోలం, వంటి సినిమాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు. ప్రస్తుతం అనుష్క శెట్టితో ఘాటి అనే సినిమా తెరకెక్కిస్తున్నాడు. ఉత్తరాంధ్ర బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ చిత్రంలో అనుష్క ట్రైబల్ మహిళగా కనిపించబోతుంది. 'వేదం' లాంటి బ్లాక్ బస్టర్ తర్వాత వీరిద్దరి కాంబో మరోసారి రిపీట్ కావడం ప్రేక్షకులలో ఆసక్తిని పెంచుతోంది. అయితే రీసెంట్‌గా ఘాటి సినిమా షూటింగ్‌ను కంప్లీట్ చేసిన క్రిష్ రెండోసారి పెళ్లి బంధంలోకి అడుగుపెట్టబోతున్నట్లు తెలుస్తుంది. హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ ప్రీతి చల్లాను క్రిష్ రెండో వివాహం చేసుకోబోతున్నారట. ఈ నెలలో ఎంగేజ్‌మెంట్ వచ్చే నెలలో పెళ్లి ఉండబోతున్నట్లు సమాచారం. అయితే క్రిష్ మొదట చేసుకున్న అమ్మాయి కూడా డాక్టర్ కావడం విశేషం. రమ్య వెలగతో క్రిష్‌కి 2016లో పెళ్లి అవ్వగా.. వీళ్లిద్దరు వ్యక్తిగత విభేదాలతో విడిపోయినట్లు తెలుస్తుంది. దీంతో చాలా రోజుల తర్వాత మళ్లీ రెండో పెళ్లి చేసుకోబోతున్నాడు క్రిష్.





# జైలర్ దర్శకుడితో ఎన్టీఆర్ మూవీ..?

దేవరతో హిట్ అందుకున్న అగ్ర కథానాయకుడు ఎన్టీఆర్ ప్రస్తుతం వరుస సినిమాలకు ఒకే చేస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే వార్ 2 సినిమాలో నటిస్తున్న తారక్ ఈ చిత్రం అనంతరం కేజీఎఫ్, సలార్ చిత్రాల దర్శకుడు ప్రశాంత్ నీల్‌తో మూవీ చేయబోతున్నాడు. ఈ చిత్రం డిసెంబర్‌లో షూటింగ్ ప్రారంభించనుంది. దీని తర్వాత మళ్లీ దేవర పార్ట్ 2 మొదలు పెట్టబోతున్నాడు తారక్. అయితే ఈ సినిమాలు లైన్‌లో ఉండగానే మరో క్రేజీ దర్శకుడితో తారక్ చేతులు కలపబోతున్నట్లు తెలుస్తుంది. హిట్లు లేక సతమవుతున్నా తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్‌కు జైలర్ వంటి బ్లాక్ బస్టర్‌ను అందించిన దర్శకుడు నెల్సన్ దిలిప్‌కుమార్‌తో తారక్ నెక్స్ట్ ప్రాజెక్ట్ చేయబోతున్నట్లు సౌత్ ఇండస్ట్రీలో టాక్ వినిపిస్తుంది. జైలర్ వంటి సూపర్ హిట్ తర్వాత నెల్సన్ ఏ ప్రాజెక్ట్ పట్టాలెక్కించలేదు. రీసెంట్‌గా ఆయన నిర్మాతగా కవిన్ హీరోగా బ్లడీ బెగ్గర్ అనే సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ సినిమా అనంతరం జైలర్ 2 సీక్వెల్ తెరకెక్కించేపనిలో ఉన్నాడు నెల్సన్. అయితే ఈ ప్రాజెక్ట్ అనంతరం నెల్సన్ తారక్ కోసం ఒక కథను రెడీ చేసినట్లు తెలుస్తుంది. కాగా దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.



# అందుకే అలాంటి సినిమాలకు దూరంగా ఉంటా : సమంత

టాలీవుడ్ స్టార్ నటి సమంత తాజాగా హిందీ వెబ్‌సిరీస్ 'సిటాడెల్: హనీ బన్నీతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. ఈ సిరీస్ ఈ నెల 7 నుంచి అమెజాన్ ప్రైమ్‌లో స్ట్రీమింగ్ అవుతోంది. ప్రస్తుతం సామ్.. ఈ సిరీస్ ప్రొమోషన్స్‌లో పాల్గొంటోంది. ఈ నేపథ్యంలో తాజాగా ఓ కార్యక్రమంలో పాల్గొన్న సమంత.. సినిమాల్లో మహిళల పాత్ర గురించి మాట్లాడారు. మహిళా పాత్రలకు తక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారని, మహిళలకు గుర్తింపు వచ్చేలా చేయడం నటిగా తన బాధ్యత అని అన్నారు. ఆడియన్స్‌ను తక్కువ అంచనా వేయకూడదని.. వారు అన్ని విషయాలను గమనిస్తుంటారని సమంత అన్నారు. అందుకే ఏం చేసినా బాధ్యతగా చేయాల్సి ఉంటుందన్నారు. తాను ఓ విషయానికి ప్రాతినిధ్యం వహిస్తున్నప్పుడు.. దానికి సంబంధించి పూర్తి బాధ్యత తనపై ఉంటుందన్నారు. అందుకే సినిమాల్లో పాత్రను ఎంచుకునే సమయంలో ఆచితూచి అడుగు వేస్తానని తెలిపారు. ఎన్నో విషయాలు గురించి ఆలోచించి నిర్ణయం తీసుకుంటానని చెప్పారు. ప్రస్తుత సమాజంలో మహిళలకు న్యాయమైన ప్రాతినిధ్యం ఉండాలని తాను భావిస్తున్నట్లు చెప్పారు. అందుకే సినిమాల్లో రెండు, మూడు సన్నివేశాలకే పరిమితమయ్యే పాత్రలకు తాను దూరంగా ఉంటానని స్పష్టం చేశారు. యాడ్స్ విషయంలోనూ ఆలోచించి నిర్ణయం తీసుకుంటానని సామ్ చెప్పుకొచ్చారు.ఇక ఇదే కార్యక్రమంలో 'సిటాడెల్: హనీ బన్నీ'లో తన పాత్ర గురించి కూడా సామ్ మాట్లాడారు. ఈ సిరీస్‌లో నటించడం తనకు సవాల్‌గా అనిపించిందన్నారు. ఇందులో తన పాత్ర హీరోకు సమానమైనదని.. యాక్షన్ సన్నివేశాల్లోనూ హీరోతో సమానంగా చేసినట్లు చెప్పుకొచ్చారు. అయితే, ఇలాంటి అవకాశాలు అరుదుగా వస్తుంటా యన్నారు. అందుకోసం నటీనటులు చాలా మంది ఎదురుచూస్తుంటారని చెప్పారు. కానీ తనకు ఇలాంటి అవకాశాలు ఎన్నో వచ్చినప్పటికీ అందులో సెలక్టివ్‌గానే వెళ్తున్నట్లు సామ్ తెలిపారు. సమంత ప్రధాన పాత్రలో నటించిన స్పై యాక్షన్ సిరీస్ ' 'సిటాడెల్: హనీ బన్నీ'. ఇందులో వరుణ్ ధావన్ కథానాయకుడిగా నటించారు. 'ది ఫ్యామిలీ మ్యాన్', 'ఫర్జీ' లాంటి విజయవంతమైన సిరీస్‌లను అందించిన రాజ్ అండ్ డీకే ఈ వెబ్ సిరీస్‌కు దర్శకత్వం వహించారు. ప్రియాంక చోప్రా నటించిన హాలీవుడ్ బ్లాక్ బస్టర్ వెబ్ సిరీస్ 'సిటాడెల్'కు రీమేక్‌గా ఈ సిరీస్‌ను తెరకెక్కించారు. ఈ సిరీస్‌లో కే కే మీనన్, సిమ్రాన్, సాకిబ్ సలీమ్, సికందర్ ఖేర్, సోహమ్ మజుందార్, శివన్‌కిత్ పరిహార్ మరియు కష్వీ మజ్ముందర్ తదితరులు ఇందులో కీలక పాత్రల్లో నటించారు.

# శ్రీవారిని దర్శించుకున్న హీరో నిఖిల్

కలియుగ దైవం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని టాలీవుడ్ యాక్టర్ నిఖిల్ సిద్ధార్థ దర్శించుకున్నారు. తన భార్య, మామ, చీరాల ఎమ్మెల్యే కొండయ్యతో కలిసి శనివారం ఉదయం వీఐపీ విరామ దర్శన సమయంలో స్వామివారి సేవలో పాల్గొన్నారు. దర్శనానంతరం వీరికి రంగనాయకుల మండపంలో పండితులు ఆశీర్వచనం చేశారు. అనంతరం స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేశారు. కాగా, నిఖిల్ నటించిన తాజా చిత్రం 'అప్పుడో ఇప్పుడో ఎప్పుడో' . స్వామిరారా ఫేం సుధీర్ వర్మ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం నవంబర్ 8న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదలైంది. ఈ చిత్రాన్ని శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర ప్రొడక్షన్స్ బ్యానర్‌పై బివిఎస్ఎన్ ప్రసాద్ నిర్మించారు.



# కన్నప్ప నుంచి ప్రభాస్ ఫొటో లీక్



మంచు ఫ్యామిలీ నుంచి వస్తున్న మోస్ట్ ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్ కన్నప్ప. దాదాపు రూ.100 కోట్ల బడ్జెట్‌తో వస్తున్న ఈ సినిమాను కలెక్షన్ కింగ్ మంచు మోహన్ బాబు నిర్మిస్తుండగా.. మంచు విష్ణు కథానాయకుడిగా నటిస్తున్నాడు. హిస్టారికల్ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ చిత్రంలో ప్రభాస్‌తో పాటు బాలీవుడ్, కోలీవుడ్ అగ్ర తారలు నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్రానికి మహాభారతం సీరియల్ ఫేమ్ ముఖేష్‌కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నాడు. అయితే ఈ సినిమా నుంచి రెబల్ స్టార్ ప్రభాస్ ఫొటో లీక్ అయిన విషయం తెలిసిందే. శివుడి భక్తుడిగా ఈ ఫొటోలో ప్రభాస్ కనిపిస్తున్నాడు. అయితే ఈ ఫొటో లీక్ చేసిన వారిపై సీరియస్ అయ్యింది కన్నప్ప టీం. ఎవరు లీక్ చేశారో తెలుసుకునేందుకు పోలీస్ కేసు పెట్టబోతున్నట్లు ప్రెస్ నోట్‌ని విడుదల చేసింది. కన్నప్ప టీమ్ నుంచి అత్యవసర, హృదయపూర్వక విజ్ఞప్తి. ప్రియమైన ప్రభాస్ అభిమానులు మరియు అందరి కథానాయకుల అభిమానులను కోరుతున్నది ఏమనగా కన్నప్ప కోసం గత ఎనిమిది సంవత్సరాలుగా మేము మా హృదయాలను, ప్రాణాలను అర్పించాము. రెండు సంవత్సరాల నిబద్ధతతో ఈ ప్రాజెక్ట్ను పూర్తి చేయడానికి మా టీమ్ నిరంతరం కృషి చేస్తోంది. ఇలాంటి క్షణంలో కన్నప్ప సినిమా నుంచి ఒక వర్క్ ఇన్ ప్రోగ్రెస్ ఇమేజ్ అనధికారంగా లీక్ అయినందుకు చాలా బాధ పడుతున్నాము, చింతిస్తున్నాము. ఈ లీక్ మా కష్టాన్ని మాత్రమే కాకుండా, ఈ ప్రాజెక్టపై నిరంతరం కృషి చేస్తున్న 2,000 మందికి పైగా %ఎఖీశ% కళాకారుల జీవితాలను కూడా ప్రభావితం చేస్తోంది. ఈ లీక్ ఎలా జరిగింది అనేది కనుగొనేందుకు మేము పోలీస్ కేసు పెట్టడం జరుగుతోంది. ఈ లీక్ అయిన ఇమేజ్ ఫుటేజ్‌ను ఎవరైనా షేర్ చేస్తూ ఉంటే, ఆ దొంగల్ని పట్టుకోమని అభిమానులందర్నీ మనస్ఫూర్తిగా కోరుతున్నాము. దీనిని షేర్ చేయడం ద్వారా, చట్టపరమైన చర్యలకు గురి కావాల్సి ఉంటుంది. ఈ లీక్ చేసిన వారిని ఎవరైనా కనుగొంటే, వారికి 5,00,000 రూపాయలు బహుమానంగా ఇస్తున్నాం. ఈ విషయం తెలుసుకున్న వెంటనే 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ ట్విట్టర్ అకౌంట్‌కి డైరెక్ట్ మెసేజ్ పంపండి అని ప్రార్థిస్తున్నాము. ప్రేమ మరియు నిబద్ధతతో పుట్టిన ఈ ప్రాజెక్ట్ %×చీజు+=×న్%ని కాపాడటానికి మీ సహాయాన్ని మనస్ఫూర్తిగా కోరుతున్నాము. ఈ సినిమా స్ఫూర్తిని కాపాడటంలో మాతో చేతులు కలపండి. హృదయపూర్వక కృతజ్ఞతలతో, కన్నప్ప టీమ్ అంటూ పోస్ట్ చేసింది.

Published and Printed by Vulloju Srinivas On Behlf of Sri Veena Publications Printed at Telalangana Veena Flat NO: 204 Mythri Apartments, Opp Bsnl Office Ecil,Kapra,Med
Responsibble for Selection of News Under The PRB ACT, Phone Number: 040 35668720, RNI Reg N0: TELTEL/12280 Reproduction in Whole or in Part  Without Written